
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

కృష్ణా జిల్లా వార్తలు

శనివారం 29 మార్చి 2025



268 మంది ఏఎన్ఎంలకు పదోన్నతులు

జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు ఈనెల 31 గడువు

మచిలీపట్నం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు పదోన్నతులకు రంగం సిద్ధమైంది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (సబ్ సెంటర్)లో 268 ఖాళీలను సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు పదోన్నతులు కల్పిస్తూ భర్తీ చేయనున్నారు. ఇందులో భాగంగా సచివాలయాల్లోని 1,189 మంది ఏఎన్ఎంలకు అర్హతలు, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటిస్తూ డీఎంహెచ్‌వో కార్యాలయంలో జాబితాను ప్రకటించారు. ప్రస్తుతం అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. మెరిట్‌లో కానీ, కమ్యూనిటీ రోస్టర్‌లో కానీ తేడాలు ఏమైనా ఉంటే చెప్పుకొనే అవకాశం కల్పించారు. ఇప్పటికే కొందరు అభ్యంతరాలను తెలిపారు. వాటిపై డీఎంహెచ్‌వో శర్మిష్ట కార్యాలయానికి పిలిపించి చర్చిస్తున్నారు. తుది జాబితా విడుదల చేసే ముందు.. ఈనెల 31లోపు మరిన్ని అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. తుది జాబితా ప్రకటించిన అనంతరం పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించి సబ్ సెంటర్లకు ఏఎన్ఎంలను అటాచ్ చేస్తారు. ఇప్పటి వరకు సచివాలయాల పరిధిలో ఉన్న ఏఎన్ఎంల్లో 268 మంది పదోన్నతుల అనంతరం సబ్ సెంటర్ల పరిధిలోకి వస్తారు. వీరికి జీతభత్యాలు సబ్ సెంటర్ల ద్వారా చెల్లిస్తారు. జాబితాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల రోస్టర్‌ను, మెరిట్‌ను అనుసరించి కొన్ని అభ్యంతరాలు వస్తూనే ఉన్నాయి. వీటిపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ జరుపుతున్నారు. ఉగాది అనంతరం తుది జాబితాలు ప్రకటించి కౌన్సెలింగ్ మిగతా 4లో..

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ జోరులో వైసీపీ బుకీ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అవనిగడ్డ నుంచి వచ్చి పటమట కేంద్రంగా రూ.లక్షల్లో పందేలు కడుతున్న అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి కుమారుడు పవన్‌కుమార్‌ను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అతని ఫోన్, బ్యాంక్ ఖాతాను పరిశీలించిన పోలీసులు తెరవెనుక ఉన్న వారిని బయటకు లాగే పనిలో పడ్డారు.

వైసీపీ బుకీ.. ఆటకట్టు

ఐపీఎల్ బెట్టింగ్‌లో అవనిగడ్డ ఎంపీపీ కుమారుడి అరెస్టు

ముందస్తు సమాచారంతో చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

- అవనిగడ్డ నుంచి వచ్చి పటమట కేంద్రంగా బెట్టింగ్‌లు
- అతని బ్యాంక్ ఖాతాలో భారీ నగదు నిల్వలు
- జనసేన మద్దతుదారుడూ పోలీసుల అదుపులో..
- నెట్‌వర్క్‌ను ఛేదించే పనిలో కాప్స్





పవన్‌కుమార్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ బెట్టింగులకు నగరంలోని అయ్యప్పనగర్ నెహ్రూ రోడ్డులో ఉంటున్న ఇళ్ల లోకేశ్ (30) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనను పోలీసు అధికారులు తీవ్రంగా పరిగణించారు. విజయవాడ కేంద్రంగా నడుస్తున్న బెట్టింగ్ నెట్‌వర్క్‌ను ఛేదించడానికి ప్రత్యేక బృందాన్ని నియమించారు. బుకీలపై నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో వేటాడదామని వేచి ఉన్న ఈ బృందానికి వైసీపీకి చెందిన అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి కుమారుడు పవన్‌కుమార్ దొరికినట్టు తెలిసింది. అతడు విస్తరించిన నెట్‌వర్క్ ద్వారా కృష్ణాజిల్లాకు చెందిన మిగతా 4లో..

ఆ డబ్బంతా పందేలదేనా..?

పవన్‌కుమార్ ఖాతాలో ఉన్న భారీ నగదు నిల్వ ఎవరిదన్న దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. బెట్టింగ్‌లో గెలిచిన వారికి చెల్లించాల్సిన మొత్తంగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మొత్తం తన కష్టార్జితంగా పవన్‌కుమార్ చెబుతున్నట్టు తెలిసింది. గోపయ్య బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై పోలీసు అధికారులు త్వరలో అధికారికంగా వివరాలు వెల్లడిస్తారని సమాచారం.

వ్యవసాయ మార్కెట్‌యార్డ్ చైర్మన్ల నియామకం

గుడ్లవల్లేరు, పెనమలూరు టీడీపీకి కేటాయింపు

ఘంటసాల జనసేనకు, మొవ్వ బీజేపీకి..

త్వరలో డైరెక్టర్ల నియామకం



పొట్లూరి రవికుమార్ (టీడీపీ) | అన్నే ధనరామ కోటేశ్వరరావు (టీడీపీ) | దోనేపూడి శివరామయ్య (బీజేపీ) | తోట కనకదుర్గ (జనసేన)

మచిలీపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నాలుగు వ్యవసాయ మార్కెట్‌యార్డ్ కమిటీలకు చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో రెండు మార్కెట్ యార్డులను టీడీపీకి, ఒకటి జనసేనకు, మరొకటి బీజేపీకి కేటాయించారు. ప్రస్తుతం మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్లను ప్రకటించగా, త్వరలో డైరెక్టర్లను నియమించనున్నారు. గుడివాడ నియోజకవర్గంలోని గుడ్లవల్లేరు మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్మన్‌గా పొట్లూరి రవికుమార్ (టీడీపీ), పెనమలూరు మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా అన్నే ధనరామకోటేశ్వరరావు (టీడీపీ)ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని ఘంటసాల మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్‌గా తోట కనకదుర్గ (జనసేన)ను, పామర్రు నియోజకవర్గం మొవ్వ మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా దోనేపూడి శివరామయ్య (బీజేపీ)ను నియమించారు. డైరెక్టర్లను త్వరలో నియమించనున్నారు.

జనావాసాలపై.. బూడిద వాన!

వెలుగుల మాటున విషవాయువులు వెదజల్లుతున్న ఎన్టీటీపీఎస్!

- నీరు, గాలి, ఆహారం సర్వం బూడిద, కలుషితమయం
- ప్రజల ప్రాణాలతో విద్యుత్ అధికారుల చెలగాటం..
- నివారించకుంటే ఇంటికో రోగి : పర్యావరణ వేత్తల హెచ్చరిక
- కొండపల్లి మున్సిపాలిటీ ఆవాసప్రాంతాలకు పొంచి ఉన్న ముప్పు
- కనీస తనిఖీలు చేపట్టని కాలుష్య నియంత్రణ మండలి
- ఎన్‌హెచ్ పక్కనే బొగ్గు పాయింట్ ఏర్పాటుకు సన్నాహాలు



ఆంధ్రజ్యోతి విజిట్

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే ప్రమాదకరంగా వదిలేసిన బూడిద కుప్పలు 4లో

యాక్షన్.. రియాక్షన్

కొలికపూడి వ్యవహారంపై అధిష్ఠానం సీరియస్

నివేదిక సమర్పించిన టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం

టీడీపీ అధిష్ఠానానికి 48 గంటల డెడ్‌లైన్ విధిస్తూ అల్టిమేటం జారీ చేసిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యాఖ్యల దుమారం కాక రేపింది. కొలికపూడి 'యాక్షన్'పై అధిష్ఠానం వెంటనే 'రియాక్ట్' అయ్యింది. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌ను రంగంలోకి దింపిన రాష్ట్ర నాయకత్వం వెంటనే నివేదిక కోరింది. ఏఎంసీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డిపై ఆరోపణలు, ఎమ్మెల్యే కొలికపూడి వ్యాఖ్యలపై ఆయన వివరాలు సేకరించి అధిష్ఠానానికి నివేదిక పంపారు. అంతేకాదు.. రాష్ట్ర కార్యాలయం నుంచి తిరువూరు నాయకులకు ఫోన్లు వస్తుండటంతో ఇక్కడి రాజకీయంపై సర్వత్రా ఉత్కంఠ రేగుతోంది.

- తిరువూరు పరిణామాలపై అక్కడి నేతలతో సమాలోచన
- కొలికపూడి వ్యాఖ్యలపై స్థానిక నాయకులతో చర్చ
- ఏఎంసీ మాజీ చైర్మన్‌పై ఆరోపణలపైనా ఆరా
- రమేశ్‌రెడ్డితోనూ మాట్లాడి వివరణ తీసుకున్న నెట్టెం
- మంగళగిరి కార్యాలయం నుంచి స్థానిక నేతలకు ఫోన్లు
- కొలికపూడి వ్యాఖ్యలపై అభిప్రాయ సేకరణ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధిష్ఠానానికి ఎందుకు అల్టిమేటం జారీ చేశారు? రాజీనామా ఎందుకు చేస్తానన్నారు? ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలవాల రమేశ్‌రెడ్డి వివాదం ఏమిటి? అనే వివరాలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం శుక్రవారం సేకరించారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులతో నెట్టెం మాట్లాడారు. గిరిజన మహిళపై ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న రమేశ్‌రెడ్డిని కూడా వివరణ కోరారు. ఫోన్ కాల్ గురించి కూడా అడిగినట్టు తెలిసింది. వివరాలన్నీ సేకరించిన నెట్టెం రఘురామ్.. అధిష్ఠానానికి నివేదిక ఇచ్చారు. ఈ నివేదికను అధిష్ఠానం పరిశీలించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోనుంది.

వైసీపీతో సంబంధాలపైనా ఆరా

కొలికపూడికి వైసీపీ నాయకులతో సంబంధాలున్నాయని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో వాటిపైనా జిల్లా పార్టీ దృష్టిసారించి విచారణ జరిపినట్టుగా సమాచారం. ఇసుక రవాణాకు సంబంధించి స్థానిక వైసీపీ నాయకులతో ఆయనకు సంబంధాలున్నాయని పార్టీ కార్యకర్తలే ఆరోపణలు చేస్తుండటంతో మూలాలేంటో తెలుసుకున్నారు. అధిష్ఠానానికి ఇచ్చిన నివేదికలో ఈ విషయాలు కూడా పొందుపరిచినట్టు తెలిసింది.

కొలికపూడి తీరుపై జిల్లా నేతల అసంతృప్తి

కొలికపూడి తీరుపై టీడీపీ జిల్లా నాయకత్వం తీవ్ర అసంతృప్తితో ఉంది. రమేశ్‌రెడ్డి ఉదంతంపై తమకు ఫిర్యాదు అందగా, విచారణ జరుపుతున్న దశలోనే అల్టిమేటం జారీ చేయటంతో షాకైంది. ఎమ్మెల్యేగా గెలిచిన ఎనిమిది నెలల్లోనే కొలికపూడి చర్యలు తీవ్ర వివాదాస్పదం కావటం, ప్రతిసారీ పార్టీకి తలనొప్పులు తీసుకురావటం ఇబ్బందికర పరిణామాలుగా మారాయి. పలు వివాదాస్పద ఘటనలకు సంబంధించి పార్టీ నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయన్ను సముదాయించినా, సుతిమెత్తగా చెప్పినా మార్పు రావటం లేదని జిల్లా పార్టీ అభిప్రాయపడుతోంది. ఇప్పటికే అధిష్ఠానం ఒకసారి ఆయన్ను పిలిచి మాట్లాడింది. ఆ తర్వాత కూడా పార్టీకి తీవ్ర తలనొప్పులు రావటంతో రెండుసార్లు టీడీపీ క్రమశిక్షణా సంఘం ముందు ఆయన హాజరు కావాల్సి వచ్చింది. తాజాగా అధిష్ఠానానికే అల్టిమేటం జారీ చేయటంతో ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు.

తిరువూరు నేతలకు ఫోన్లు

అధిష్ఠానం ఆదేశాల మేరకు మంగళగిరిలోని టీడీపీ కార్యాలయ సిబ్బంది తిరువూరు నియోజకవర్గ నేతలకు శుక్రవారం ఫోన్లు చేశారు. అన్ని మండలాలు, వార్డు అధ్యక్షులకు ఈ ఫోన్లు వెళ్లాయి. వీరిలో చాలా మంది కొలికపూడి వ్యాఖ్యలను ఖండించినట్టుగా తెలుస్తోంది. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశాలున్నా కొలికపూడి దుందుడుకుతనంతో వ్యవహరించారని వారు అభిప్రాయపడ్డారు. పార్టీకి అల్టిమేటం జారీ చేయటం తగదని, సమస్యను అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తే సరిపోయేదని చెప్పినట్టు సమాచారం. ఇలాంటి దుందుడుకు చర్యల వల్ల నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని, అధిష్ఠానం తక్షణం చెక్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిసింది.

రియల్ బూస్ట్

- నాలా చట్టం రద్దు నిర్ణయంతో సర్వత్రా హర్షం
- రెవెన్యూ అధికారులకు ఆదాయ వనరు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫీజు పెంపు.. దోపిడీ
- చంద్రబాబు నిర్ణయానికి అన్ని వర్గాల నుంచి మద్దతు

6లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-24 (శనివారం సాయంత్రం)

సహర్ : 04-44 (ఆదివారం ఉదయం)



రేపు స్వర్ణభారత్ ట్రస్టులో ఉగాది సంబరాలు

- పాల్గొననున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య, ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఉన్నతాధికారులు

4లో



రేపట్నుంచి ఇంద్రకీలాద్రిపై ఉగాది ఉత్సవాలు

4లో

అడ్డగోలు నియామకాలు

మచిలీపట్నం మండల వెలుగు కార్యాలయంలో నిర్వాకాలు

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. సరైన విద్యార్హత లేకున్నా అడ్డగోలుగా పదోన్నతులు ఇచ్చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఏపీఎం బదిలీలను గుట్టుచప్పుడు కాకుండా చేసేస్తున్నారు. ప్రతి పనికీ రేటుకట్టి ఫైళ్లు కదిపేస్తున్నారు. జిల్లా కలెక్టర్‌ను, సెర్ప్ అధికారులను బురిడీ కొట్టించి మరీ ఫైళ్లు కదుపుతున్నా పట్టించుకునేవారే లేరు.

- పదో తరగతి చదివిన మహిళకు ఏపీఎంగా పదోన్నతి
- అనేక అవినీతి ఆరోపణలున్నా అడ్డగోలుగా నియామకం
- మండల సమాఖ్య అధ్యక్షురాలి సిఫార్సు లేఖే కారణం
- సెర్ప్ తిరస్కరించినా పోస్టింగ్ ఇవ్వడంపై అనుమానాలు



మచిలీపట్నం మండల సమాఖ్య కార్యాలయం

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం) : మచిలీపట్నం మండల వెలుగు కార్యాలయంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ (సీసీ)గా ఓ మహిళ పనిచేస్తోంది. కొన్నేళ్లుగా ఈ కార్యాలయంలో ఆమె హవా సాగుతోంది. అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం)గా ఎవరొచ్చినా ఇబ్బందులు పెట్టడం, ఇక్కడ పనిచేయలేమని వారితోనే చెప్పించటం, ఏదో ఒక రూపంలో వెళ్లిపోయేలా చక్రం తిప్పటం కొంతకాలంగా జరుగుతోంది. ఇటీవల వరకు ఏపీఎంగా పనిచేసిన ఉద్యోగిని ఇక్కడి నుంచి పంపించేశారు. దీంతో ఇక్కడ ఏపీఎంగా పనిచేసేందుకు ఎవరూ ముందుకురావటంలేదనే కారణం చూపి సీసీగా పనిచేస్తున్న మహిళను ఏపీఎంగా మిగతా 4లో..

జనావాసాలపై.. బూడిద వాన!



(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

తినే ఆహారం.. తాగే నీరు.. పీల్చే గాలి.. అంతా కలుషితం. ఫలితంగా శ్వాసకోశ వ్యాధులు.. అనేక రుగ్మతలు వ్యాప్తి చెందుతున్నాయి. కొండపల్లి పరిసరాల్లో ఎక్కడ చూసినా బూడిద దర్శనమిస్తోంది. ఈ పరిణామం ఆందోళనకు గురిచేస్తోంది. ఒక వైపు ప్రజలు, మరో వైపు పర్యావరణం, ఇంకోవైపు పశువులు.. ఇలా సకల జీవరాశులు.. చెట్లు, చేమలు, వాగులు, వంకలు, నదులు అన్నీ ఎన్టీటీపీఎస్ బూడిద బాధితులుగా మారిపోయాయి. ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో బూడిద కాలుష్య నివారణకు ప్లాంట్ యాజమాన్యం, ఉన్నతాధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడంతో ప్రజలకు శాపంగా మారింది.

● ఎన్టీటీపీఎస్‌లో మొత్తం ఎనిమిది యూనిట్లు ఉన్నాయి. మొత్తం 210 మెగావాట్ల సామర్థ్యం గలవి ఆరు యూనిట్లు, 500 మెటావాట్ల సామర్థ్యం గల ఒక యూనిట్, 800 మెగావాట్ల సామర్థ్యం గల ఒక యూనిట్ నుంచి మొత్తం 2,560మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇందుకుగాను రోజుకు సుమారు 40 వేల టన్నుల బొగ్గును వాడుతుంటారు. 40 వేల టన్నుల బొగ్గు నుంచి సుమారు 20 వేల టన్నుల తడి, పొడి బూడిద విడుదలవుతుంది. పైపులైన్ ద్వారా తడి బూడిదను యాష్‌పాండ్‌కు తరలిస్తుంటారు. అది కాక బొగ్గు వినియోగం ద్వారా వచ్చే బూడిదను ప్లాంట్‌కు ఉన్న సైలోస్ ద్వారా వాహనాల్లో నింపి సిమెంట్ ఫ్యాక్టరీలకు యాష్ ట్యాంకర్ల ద్వారా బయటకు తరలిస్తుంటారు. అయితే 800 మెగావాట్ల ప్లాంట్‌లో సైలోస్ లేకపోవడంతో బూడిదను నేరుగా కిందకు వదిలేస్తున్నారు. మిగిలిన ఏడు యూనిట్లలో కూడా మెయింటినెన్స్ సరిగా లేకపోవడంతో ప్లాంట్‌లో వదిలేస్తున్నారు. ఇలా వదిలిన బూడిద నేరుగా గాలిలో కలుస్తోంది. దీంతో కొండపల్లి, ఇబ్రహీంపట్నం, పశ్చిమ ఇబ్రహీంపట్నం, జూపూడి, కిలేశపురం, మూలపాడు, కేతనకొండ, కొటికలపూడి, తుమ్మలపల్లి, గుంటుపల్లి, ఈలప్రోలు, రాయనపాడు, పైడూరుపాడు వరకు బూడిద నేరుగా గాలిలో కలిసి ఆయా గ్రామాలపై పడిపోతుంది.

- వెలుగుల మాటున విషవాయువులు వెదజల్లుతోన్న ఎన్టీటీపీఎస్!
- నీరు, గాలి, ఆహారం సర్వం బూడిద, కలుషితమయం
- ప్రజల ప్రాణాలతో విద్యుత్ అధికారుల చెలగాటం..
- నివారించకుంటే ఇంటికో రోగి ఖాయం : పర్యావరణ వేత్తల హెచ్చరిక
- కొండపల్లి మున్సిపాలిటీ ఆవాసప్రాంతాలకు పొంచి ఉన్న ముప్పు
- కనీస తనిఖీలు చేపట్టని కాలుష్య నియంత్రణ మండలి
- ఎన్‌హెచ్-30 పక్కనే బొగ్గు స్టాక్ పాయింట్ ఏర్పాటుకు సన్నాహాలు

దేశానికే వెలుగులు ఇచ్చిన విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్) ఖ్యాతి బూడిదలో పోసిన పన్నీరులా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పాపాలు నేడు శాపాలుగా మారాయి. ప్రధానంగా నాసిరకం బొగ్గు కొనుగోలు చేయడంతో ప్లాంట్ మొత్తం బూడిదమయమైంది. నాటి పాపం ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. బూడిద కాలుష్యంపై ప్రజలు ప్లాంట్ ఎదుట తిరుగుబాటు చేయడంతో సుమోటాగా కేసులు పెట్టించుకునే దయనీయ స్థితికి ఎన్టీటీపీఎస్ దిగజారింది. దీంతో ఇబ్రహీంపట్నం కాస్తా బూడిదపట్నంగా మారిపోయింది. ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంపై సమగ్ర కథనం..


సైలోస్ లేకపోవడంతో నేరుగా పైకి లేస్తున్న బూడిద


రహదారి పక్కనే ప్రమాదకరంగా బూడిద కుప్పలు

కొన్నిచోట్ల అయితే నేరుగా ఇళ్లలోకే వెళ్లిపోతుంది. ఆగి ఉన్న వాహనాల నిండా, నీటి తొట్టెల నిండా బూడిదే. ఇక టిఫెన్ సెంటర్ల ప్లేట్లలో సైతం బూడిద దర్శనమివ్వడం శోచనీయం. ప్లాంట్ నుంచి నేరుగా వెళ్లి బూడిద చెరువులో కలిసే నీరు కృష్ణానదిలో కలుస్తుంది. ప్లాంట్ నుంచి మరో డ్రెయినేజీ ద్వారా వచ్చే బూడిద నీరు కూలింగ్ కెనాల్‌లో కలుస్తుంది. దానిలో నుంచి ఇబ్రహీంపట్నం ఫిల్టర్ బెడ్‌లోకి తీసుకునే తాగునీరు సైతం కలుషితం అవుతోంది. 104 గ్రామాలకు వెళ్లే తాగునీటిలో బూడిద అవశేషాలు ఎంత శుద్ధి చేసినా మిగులుతునే ఉంటున్నాయని నీటి కుళాయిల వద్ద గుడ్డలు అడ్డుపెట్టి మరీ వస్తున్న బూడిదను ప్రజలు చూపుతున్నారంటే బూడిద ఏస్థాయిలో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందో అర్థమవుతోంది.

● **ఎందుకిలా జరుగుతోంది?**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బూడిదను బంగారం చేశారు అధికార పార్టీ నేతలు. ప్రజల ప్రాణాలను బూడిద కాలుష్యం హరిస్తుంటే ప్రజా ప్రతినిధులకు, ప్లాంట్‌లోని కొందరు ఉద్యోగులకు, అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. దీంతో బూడిద వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగటంతో నివారణ చర్యలపై ఏ ఒక్కరూ శ్రద్ధ చూపలేదనే ఆరోపణలున్నాయి. ఈ కారణంగానే బూడిద కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతోందనేది నిత్య సత్యం.

● **కొండపల్లి రిజర్వు ఫారెస్టుకు ముప్పు!**

ప్లాంట్ నుంచి వెలువడుతున్న బూడిద వల్ల కొండపల్లి రిజర్వు ఫారెస్టు సర్వనాశనం అవుతోంది. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లి వరకు ఉన్న రిజర్వు ఫారెస్టులో పచ్చని చెట్లు మాడిపోయాయి. ఒకప్పుడు పచ్చగా దర్శనమిచ్చిన కొండపల్లి కొండలు బూడిదతో వాటి సహజత్వాన్ని కోల్పోయాయి. కొండల్లో చెట్లు మాడిపోయి బోడిగా దర్శనమిస్తున్నాయి. ఈ పరిణామం పర్యావరణ ప్రేమికులను తీవ్రంగా కలచివేస్తున్నది. రైతులు సాగు చేస్తున్న పంటలు సైతం బూడిద బారిన పడి నాశనమవుతున్నాయి. బూడిద కాలువల్లో నీరు తాగి పశువులు సైతం రోగాల బారిన పడుతున్నాయని, కలుషిత నీరు తాగిన పశువుల సూడి నిలవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

● **సుమోటోగా కేసులు**

ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంపై గతేడాది నవంబరులో 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రాణాలు హరిస్తున్న ఎన్టీటీపీఎస్ మాకొద్దు' శీర్షికన ప్రచురితమైన కథనంతో ఎన్జీటీ సుమోటోగా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, చైర్‌పర్సన్, నిపుణుల సభ్యుడు డాక్టర్ ఎ.సెంథిల్ వేల్‌తో కూడిన జాతీయ హరిత ట్రిబ్యునల్ ప్రధాన ధర్మాసనం స్వయంగా కేసును స్వీకరించింది. ప్లాంట్ నుంచి విడుదలయ్యే బూడిద దాదాపు 10 కిలోమీటర్ల వ్యాసార్థంలో గ్రామాలను కలుషితం చేస్తోందని, సమీప పంటలను నాశనం చేయడాన్ని తీవ్రంగా పరిగణించి వాయు (కాలుష్య) నివారణ, నియంత్రం చట్టం 1981, పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986 నిబంధనలను ఉల్లంఘించడాన్ని ఎన్జీటీ గుర్తించింది. ఈకేసులో కేంద్ర, రాష్ట్ర, కాలుష్య నియంత్రణ బోర్డు, పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖ, విజయవాడ జిల్లా మేజిస్ట్రేట్‌లను ప్రతివాదులుగా ట్రిబ్యునల్‌లో చేర్చింది. 2025 జనవరి 10న విచారణ జాబితాలో చేర్చింది. అయినా ఎన్టీటీపీఎస్ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రతి వాదులుగా చేర్చిన వారి తీరులో ఏమాత్రం మార్పు రావడం లేదు. బూడిద కాలుష్యం మరింత అధికమైంది.

● **వైసీపీ పాలకుల పాపం.. ప్లాంట్‌కు శాపం**

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీటీపీఎస్‌లో కాలుష్య నివారణచర్యలు పూర్తిగా గాలికొదిలేయడమే నేటి దుస్థితికి కారణంగా తెలుస్తోంది. గత ప్రభుత్వంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు విజయవాడలో ఉన్న ఎన్టీటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో పార్టీలు చేసుకునేందుకే పరిమితం అయ్యారనే ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి. నాటి నిర్లక్ష్యం నేడు ప్లాంట్‌కు, ఈప్రాంత ప్రజలకు శాపంగా దాపురించాయి.

● **రోగాల బారిన వందల సంఖ్యలో ఉద్యోగులు**

ఎన్టీటీపీఎస్ ప్లాంట్‌లో అనేక విభాగాల్లో వేలసంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు ఉంటే వారిలో వందల సంఖ్యలో కాలుష్యం వల్ల రోగాలబారిన పడిన ఘటనలు వెలుగు చూస్తున్నా సంస్థ ఉన్నతాధికారుల్లో ఏమాత్రం చలనం లేదు.

బూడిద చాలనట్లు బొగ్గు స్టాక్ పాయింట్

ఇప్పటికే బూడిద కాలుష్యంతో అల్లాడుతున్న ప్రజల నెత్తిన మరో పిడుగు వేసేందుకు ఎన్టీటీపీఎస్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇబ్రహీంపట్నం- చత్తీస్‌ఘడ్ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎన్టీటీపీఎస్ కొత్తగేటు వద్ద ప్రభుత్వ ఆసుపత్రి, డీఏఈ స్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఖాళీగా ఉన్న ఎన్టీటీపీఎస్ స్థలంలో బొగ్గు స్టాక్ పాయింట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. కొద్ది రోజులుగా ఖాళీ స్థలంలో పనులు చేయిస్తున్నారు. 5వ దశ 800 మెగావాట్ల యూనిట్‌కు బొగ్గును నేరుగా పంపేందుకు ఇక్కడ స్టాక్ పాయింట్ పెడుతున్నారు. ఇదే కనుక జరిగితే జాతీయ రహదారి బొగ్గుమయం కావడం ఖాయమని, పాతగేటు ఎదురుగా ఉన్న నివాశితులకు, ఆసుపత్రి సిబ్బంది, రోగులకు, పాఠశాల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తప్పవనే వాదన బలంగా వినిపిస్తున్నది.


ఎన్.హెచ్ 30 ఆనుకుని బొగ్గు స్టాక్ పాయింట్ ఏర్పాటుకు కేటాయించిన స్థలం

● **వైద్య శిబిరాలు ఏమయ్యాయి?**

ప్లాంట్ పరిసరాల్లో ప్రజలు, పశువులకు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు సరఫరా చేయాల్సి ఉంది. ఎన్టీటీపీఎస్ అధికారులు మొక్కుబడి తంతుగానే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులు సైతం విడుదల చేయడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

మాస్క్ లేకుండా ఉండలేకపోతున్నాం

- ఖుద్రు, ఇబ్రహీంపట్నం



మాస్క్ లేకుండా క్షణం కూడా ఉండలేం. ప్లాంట్ నుంచి బూడిద పెద్ద ఎత్తున బయటకు వచ్చేస్తుంది. దుకాణంలో ప్రతి వస్తువుపైనా పడిన బూడిద దులుపుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా ఆరోగ్యాలు ఏమవుతాయోనని భయాందోళన చెందుతున్నాం. ఇబ్బందయినా మాస్క్ ఉండాల్సిందే.

ఇళ్లలో ఉండే పరిస్థితి లేదు

- జాస్తి గోపాలకృష్ణ, గుంటుపల్లి



ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంతో ఇళ్లల్లో ఉండే పరిస్థితి లేదు. బూడిద వర్షం వచ్చినట్టు ఇళ్లను, పంటలను కమ్మేస్తుంది. దీంతో పంటలు పాడవుతున్నాయి. వాహనాల నిండా బూడిదే. పర్యావరణం సర్వనాశనమవుతోంది. ఎన్టీటీపీఎస్ అధికారులు మొక్కల పెంపకాన్నే విస్మరించారు.

రేపట్నుంచి ఇంద్రకీలాద్రిపై ఉగాది ఉత్సవాలు ప్రారంభం



వన్‌టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఈనెల 30నుంచి ఉగాది ఉత్సవాలను నిర్వహించనున్నారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఈనెల 30న కనకదుర్గమ్మకు సుప్రభాతం అనంతరం స్నపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలంకారం తదితర పూజాదికాలు ముగిసిన తరువాత ఉదయం అంతరాలయంలో నిర్వహించే సుప్రభాత సేవ, వస్త్రాలంకరణ, ఖడ్గమాల, యాగశాలలో నిర్వహించే రుద్రహోమాలను రద్దు చేశారు. అయితే లక్ష కుంకుమార్చన, శాంతికల్యాణం, శ్రీచక్ర నవావరణార్చన, చండీ హోమం, సౌభాగ్యప్రదాయిని, అష్టోత్తర , శతనామార్చన తదితరాలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయి. 30 నుంచి ఏప్రిల్ 7 వరకు వసంత నవరాత్రుల పూజల సందర్భంగా కొండపైన లక్ష్మీగణపతి మందిరం వద్ద కనకదుర్గమ్మవారికి రోజుకో ప్రత్యేక పుష్పాలతో అర్చనలు జరుగుతాయి. ప్రత్యేక పుష్పార్చనల్లో పాల్గొనే దంపతులు రూ. 2,500 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఉగాది నాడు మధ్యాహ్నం 3 గంటలకు పంచాంగ శ్రవణం అనంతరం గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులతో వెండి రథోత్సవం జరుగుతుంది.

ఏపీలో మైక్రోబయాలజీ ల్యాబ్‌ల ఆధునికీకరణ

- కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ వెల్లడి

వన్‌టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ద కంటైన్‌మెంట్ ఆఫ్ యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎన్‌పిపి-ఎఎంఆర్) కింద మైక్రోబయాలజీ ల్యాబొరేటరీలు 14 రాష్ట్రాల్లో మొత్తం 50 ప్రయోగశాలలు ఆధునీకరించినట్టు. వాటిలో ఏపీలోని గుంటూరు మెడికల్ కాలేజీ, విశాఖలో ఆంధ్ర మెడికల్ కాలేజీ, తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలు ఉన్నాయని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ వెల్లడించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీ భరత్ కలిసి యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ అభివృద్ధిపై లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు శుక్రవారం కేంద్రమంత్రి లిఖిత పూర్వకంగా సమాధానం తెలిపారు. యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ పర్యవేక్షణ కోసం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రయోగశాలలు అభివృద్ధి చేసినట్టు తెలిపారు.

నందిగామకు ఆయుష్ పరిశోధనా కేంద్రం!

- ఫలించిన ఎంపీ కృషి

నందిగామ : నందిగామలో ఆయుష్ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఎంపీ శివనాథ్(చిన్ని) కృషి ఫలించింది. ఆయుష్ ఆధ్వర్యంలో దేశంలో పెద్దఎత్తున వైద్యశాలలు, పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు శుక్రవారం పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ ప్రశ్నకు ఆయుష్ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ బదులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే నందిగామలో 25 నుంచి 50 పడకల సమగ్ర ఆయుష్ పరిశోధనా వైద్యశాల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు.

ఓంబిర్లాను కలిసిన ఎంపీ శివనాథ్

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను శుక్రవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి వెంకన్న ప్రసాదం అందజేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన కమిటీ ఆన్ అబ్సెన్స్ ఆఫ్ మెంబర్ ఫ్రమ్ ది సిట్టింగ్ ఆఫ్ ది హస్‌లో సభ్యుడిగా తనను నియమించినందుకు ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.


ఓంబిర్లాకు తిరుపతి ప్రసాదం అందజేస్తున్న ఎంపీ శివనాథ్

బెజవాడ బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాషా, రంగారావు


ఎ.కె. బాషా


కె.వి.రంగారావు


అనురాధ

విజయవాడ లీగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అధ్యక్షుడిగా ఎ.కె.బాషా, ప్రధాన కార్యదర్శిగా కేవీ రంగారావు గెలుపొందారు. లైబ్రేరియన్ సెక్రటరీగా త్రినాథ్, జాయింట్ సెక్రటరీగా జీవీ లక్ష్మీ, స్పోర్ట్స్ సెక్రటరీగా పల్లగాని రవి బాబు, ట్రెజరర్‌గా ముద్దాడ సత్యనారాయణ గెలుపొందారు. బార్ అసోసియేషన్ మహిళా కార్యదర్శిగా అనూరాధ గెలుపొందారు. బెజవాడ బార్ 2025-26 ఎన్నికల పోలింగ్ శుక్రవారం కోలాహలంగా సాగింది. మొత్తం 1876 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మహిళా న్యాయవాదుల ఓట్లు 420కాగా, 1456 ఓట్లు పురుషులవి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4.30 గంటలకు ముగిసింది. బెజవాడ బార్ ఉపాధ్యక్షులుగా పిళ్లా శ్రీనివాసరావు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కృష్ణా వర్సిటీ పీజీ, ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు వెల్లడి

మచిలీపట్నం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలకు చెందిన పీజీ, ఎంబీఏ, ఎంసీఏ మొదటి, మూడవ సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి కె.రాంజీ ప్రకటించారు. 1వ సెమిస్టర్‌లో 76.33, 3వ సెమిస్టర్‌లో 82.12 శాతం ఉత్తీర్ణులయినట్టు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి పి. వీరబ్రహ్మాచారి తెలిపారు. పునఃమూల్యాంకనం కోసం ఏప్రిల్ 15లోగా రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

268 మంది ఏఎన్‌ఎంలకు పదోన్నతులు

(3వ పేజీ తరువాయి)

నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

దళారులను నమ్మొద్దు : డీఎంహెచ్‌వో

పదోన్నతుల కౌన్సెలింగ్‌పై దళారులను నమ్మొద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి శర్మిష్ట పేర్కొన్నారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి మాత్రమే పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు. ఏ విధమైన సిఫార్సులకు తావులేదని, అభ్యంతరాలుంటే 31లోగా తమ కార్యాలయానికి వచ్చి తెలియజేయవచ్చని ఆమె పేర్కొన్నారు.

వైసీపీ బుకీ..ఆటకట్టు

(3వ పేజీ తరువాయి)

మరో బుకీని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈ బుకీ జనసేనకు మద్దతుదారుడిగా ఉన్నట్టు తెలిసింది.

పటమటలో పందేలు

సన్‌రైజర్స్ హైదరాబాద్, లఖ్‌నవు సూపర్ జైంట్స్ జట్ల మధ్య గురువారం మ్యాచ్ జరిగింది. దీనిపై పటమటలోని దర్శిపేటకు సమీపాన రాఘవనగర్‌లో ఉంటున్న తుంగల పవన్‌కుమార్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. వారు వెంటనే ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. పవన్‌కుమార్ ఉంటున్న స్థావరాన్ని చుట్టిముట్టి లోపలకు వెళ్లే సరికి పందేలు జరుగుతున్నాయి. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. పవన్‌కుమార్ బ్యాంక్ ఖాతాను పరిశీలించగా, లక్షలాది రూపాయల నిల్వ ఉన్నట్టు గుర్తించారని తెలిసింది. అతడిని విచారణ చేయగా, ఉమ్మడి కృష్ణాజిల్లా మొత్తం నెట్‌వర్క్‌ను విస్తరించినట్టు వెల్లడించాడని సమాచారం. పవన్‌కుమార్‌తో నిత్యం ఫోన్లలో ఎవరెవరు సంభాషణలు జరిపారన్న వివరాలను ఈ ప్రత్యేక బృందం ఆరా తీసినట్టు తెలిసింది. అతడి ఫోన్ సంభాషణలన్నీ ఎక్కువగా వాట్సాప్ కాల్స్ ద్వారా సాగినట్టు సమాచారం. పవన్‌కుమార్‌తో నిత్యం సంప్రదింపులు జరుపుతున్న అవనిగడ్డకు చెందిన జనసేన మద్దతుదారుడు చెన్నా గోపయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. పవన్‌కుమార్ వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో భారీగా బెట్టింగ్‌లు నిర్వహించినట్టు ఆరోపణలు ఉన్నాయి. అతడి స్వస్థలం అవనిగడ్డ అయినప్పటికీ విజయవాడ కేంద్రంగా బెట్టింగ్‌లు నడుపుతున్నాడు. పవన్‌కుమార్ ప్రధాన బుకీగా ఉంటూ ఉమ్మడి జిల్లాలో సబ్ బుకీలను నియమించుకున్నాడు. ఈ నెట్‌వర్క్‌ను ఛేదించి మిగిలిన బుకీల ఆట కట్టించే పనిలో ప్రత్యేక బృందం ఉన్నట్టు తెలిసింది.

రేపు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో ఉగాది సంబరాలు

- పాల్గొననున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య, సీఎం చంద్రబాబు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఉన్నతాధికారులు

ఉంగుటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడచాప్టర్)కు ఈనెల 30న ముఖ్యమంత్రి చంద్రబాబు విచ్చేయుచున్న సందర్భంగా భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం 2.30గంటల నుంచి ట్రస్ట్‌లో జరిగే ఉగాది సంబరాల్లో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుతో కలిసి సీఎం చంద్రబాబు పాల్గొంటున్న దృష్ట్యా ముందస్తు భద్రతా(ఏఎస్ఎల్)ఏర్పాట్లను జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ ఆర్.గంగాధరరావుతో కలిసి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. తొలుత అధికారులతో ప్రాంగణమంతా కలియదిరిగిన కలెక్టర్ ట్రస్ట్‌లో పలు వృత్తి నైపుణ్య శిక్షణాకేంద్రాలు, ల్యాబ్‌లను సందర్శించారు. వివిధ శిక్షణా కార్యక్రమాల గురించి ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పరదేశి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ప్రజామందిరంలో సీఎం సభావేదిక, సీటింగ్, మైక్‌సిస్టమ్ తదితర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ట్రస్ట్ ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉగాది సంబరాల్లో పాల్గొన్న అనంతరం సువెన్ ఫార్మా సహకారంతో ట్రస్ట్ ఆవరణలో నూతనంగా ఏర్పాటుచేసిన ఫార్మాల్యాబ్, ఫార్మా తయారీ నైపుణ్య శిక్షణాకేంద్రాన్ని సీఎం ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమానికి ఎలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి వచ్చేప్రముఖులు, అధికారులకు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్, జేసీ, ఎస్పీలతో పాటు అదనపు ఎస్పీ సత్యనారాయణ, ఎస్‌హెచ్‌జీ అదనపు ఎస్పీ శ్రీనివాసు, డీఎస్పీ చంద్రశేఖర్, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాస్, జిల్లా ఫైర్‌ఆఫీసర్ ఏసురత్నం, ఏపీఎంఐపి పీడీ జి.విజయలక్ష్మి, ఎస్సీ సీఐ వి.శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ, ఎస్పీ

అడ్డగోలు నియామకాలు

(3వ పేజీ తరువాయి)

నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండల సమాఖ్య అధ్యక్షురాలి పదవీకాలం పూర్తయినా ఆమె సిఫార్సు లేఖతో ఇలా నియమించారు. మండల స్థాయిలో ఏపీఎంలను నియమించాలంటే.. పరీక్ష పెట్టి, ఐఏఎస్ అధికారి స్థాయిలో ఇంటర్వ్యూ చేసి నియమించేవారు. మచిలీపట్నం మండలంలో మాత్రం పదో తరగతి విద్యార్హత ఉన్న మహిళను ఏపీఎంగా నియమించటంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

విచారణ చేసి ఫైల్ పక్కనపెట్టారు

మచిలీపట్నం మండలం ఏపీఎంగా నియమితురాలైన మహిళ గతంలో డ్వాక్రా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన కమీషన్ లక్షలాది రూపాయలను మాయం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై పలు ఫిర్యాదులు అందటంతో గతంలో అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో వెల్లడైన అంశాలకు సంబంధించిన నివేదికను వెల్లడి చేయకుండా, సదరు సీసీపై క్రమశిక్షణా చర్యలు తీసుకోకుండా తొక్కిపెట్టారు. మండల సమాఖ్య కార్యాలయంలో తలలో నాలుకలా వ్యవహరించే ఈ సీసీ.. శ్రీనిధి తదితర రుణాలు మంజూరు చేసే సమయంలోనూ తనదైనశైలిలో వ్యవహరిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. మండల పరిధిలోని ఎస్ఎన్ గొల్లపాలెం, సీతారాంపురం తదితర గ్రామాల్లో నకిలీ డ్వాక్రా సంఘాలను ఏర్పాటుచేసి బ్యాంకుల ద్వారా రుణాలు పొందారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ రుణాలు సకాలంలో చెల్లించకపోవటంతో నకిలీ డ్వాక్రా సంఘాల బాగోతం బయటపడింది. ఈ అంశంపైనా విచారణ చేసిన అధికారులు నివేదికలను అటకెక్కించారు. ఇటీవల వరకూ మండలంలో ఏపీఎంగా పనిచేసిన ఉద్యోగిని వివిధ రకాలుగా ఇబ్బందులు పాల్జేయటంతో తానిక్కడ పనిచేయలేనని పైఅధికారులకు మొరపెట్టుకుని ఆయన వేరే మండలానికి వెళ్లిపోయారు. దీంతో మండలంలో ఏపీఎం పోస్టు ఖాళీగా చూపి సీసీని ఏపీఎంగా నియమించటం విశేషం. కలెక్టర్‌కు, సెర్ప్ అధికారులకు తెలియకుండా సీసీని ఏపీఎంగా నియమించటంలో డీఆర్‌డీఏ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మండల సమాఖ్యలో రూ.1.10 కోట్ల వరకు నగదు ఉండగా, దానిని దారి మళ్లించేందుకు అనేక ప్రయత్నాలు చేశారు.ఈ అంశంపై పత్రికల్లో వార్తలు రావటంతో అధికారులు ఆప్రక్రియకు బ్రేక్‌లు పడ్డాయి.

గతంలో తిరస్కరించినా..

మండల సమాఖ్య కార్యాలయంలో సీసీగా పనిచేస్తున్న మహిళను ఏపీఎంగా నియమించాలని వివిధ రూపాల్లో అధికారులపై ఒత్తిడి వచ్చింది. సీసీని ఏపీఎంగా నియమించే విషయంపై గతంలో డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా చేసిన నాగేశ్వరనాయక్ సెర్ప్ అధికారులకు లేఖ రాశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నియమించకూడదని సెర్ప్ అధికారులు సూచించడంతో నియామకానికి గండిపడింది. అయినా సమయం కోసం వేచి ఉన్న సీసీ డీఆర్‌డీఏగా పీడీగా ఇటీవల హరిహరనాథ్ బాధ్యతలు తీసుకోవటంతో ఫైల్‌ను తెరపైకి తెచ్చారు. హుటాహుటిన సీసీని ఏపీఎంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అడ్డగోలు బదిలీలు

డీఆర్‌డీఏ పీడీగా హరిహరనాథ్ బాధ్యతలు తీసుకోక ముందు మెప్మా పీడీ పి.సాయిబాబు ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీగా వ్యవహరించారు. ఈ సమయంలో ఘంటసాల ఏపీఎంను గుడ్లవల్లేరుకు, కోడూరు ఏపీఎంను మొవ్వకు, గుడ్లవల్లేరు ఏపీఎంను పెదపారుపూడికి బదిలీ చేశారు. గత ఏడాది అన్ని శాఖల్లో ఉద్యోగుల బదిలీ ప్రక్రియను నిర్వహించారు. డీఆర్‌డీఏలోనూ బదిలీలు చేపట్టినప్పటికీ నాలుగైదు నెలల్లోనే మళ్లీ అనధికారికంగా బదిలీలు చేయటం గమనించదగ్గ అంశం. ఈ బదిలీల్లో ఏదో మతలబు దాగి ఉందని ఆ శాఖ అధికారులు, సిబ్బంది చెప్పుకొంటున్నారు.

తాత్కాలికంగానే నియమించాం..

మచిలీపట్నం మండలంలో ఏపీఎం పోస్టు ఖాళీ కావటంతో పరిపాలనా సౌలభ్యంకోసం సీసీని ఏపీఎంగా తాత్కాలికంగా నియమించాం. త్వరలో వేరే మండలం నుంచీ ఏపీఎంలను తీసుకొచ్చి మచిలీపట్నం మండలానికి నియమిస్తాం.

- హరిహరనాథ్, డీఆర్‌డీఏ పీడీ


కేఈబీ కెనాల్‌లోకి బోల్తా కొట్టిన ట్రాక్టర్, మృతుడు కరిమిశెట్టి నరేంద్రబాబు

కెనాల్‌లోకి దూసుకెళ్లిన ఇసుక ట్రాక్టర్

- డ్రైవర్ మృతి

ఘంటసాల,మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం క్వారీ నుంచి ఇసుకలోడుతో అవనిగడ్డ వైపు వెళుతున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కేఈబీ కెనాల్‌లోకి దూసుకెళ్లి పల్టీకొట్టింది. తీవ్రగాయాలతో డ్రైవర్ మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం.. అవనిగడ్డకు చెందిన కరిమిశెట్టి నరేంద్రబాబు(నాని) (40) శ్రీకాకుళం క్వారీలో శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసుకుని అవనిగడ్డ వైపు బయలుదేరాడు. కేఈబీ కెనాల్ వద్ద కొత్త వంతెన సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనానికి దారిచ్చే క్రమంలో ఒక్కసారిగా ట్రాక్టర్ కెనాల్‌లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్ నాని తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని రేపల్లెకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 460

ట్రాఫిక్ నియమాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటనారాయణ

పెనమలూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ సూచించారు. శుక్రవారం తాడిగడప, కామయ్యతోపు సెంటర్లలో ట్రాఫిక్ నియమాలపై కానూరు కేసీపీ పాఠశాల విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే విద్యార్థులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. రోడ్డుపై ఎడమవైపు మార్జిన్‌లో వాహనాలను నడపాలని సూచించారు. మైనర్లు ద్విచక్రవాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులయితే వారి తల్లిదండ్రులకు శిక్షలు పడేట్టు చట్టాలు రూపొందించారని తెలిపారు.









సనత్‌నగర్‌లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పక్కన ఈడుపుగల్లు ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బోడె

అలపాటిని సత్కరిస్తున్న కొనకళ్ల, ప్రతిభ సివిల్స్ అకాడమీ ప్రతినిధులు

సనత్‌నగర్‌ను దశల వారీగా అభివృద్ధి చేస్తా

● అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కానూరులో ముస్లింలు ఎక్కువగా నివసించే సనత్‌నగర్ ప్రాంతాన్ని దశల వారీగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. శుక్రవారం రూ.2.8కోట్లతో సనత్‌నగర్‌లో తులసీనగర్-మహదేవపురం కాలనీ రోడ్డు, యూసీ టీస్టాల్-తులసీనగర్ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. వారంలో నిర్మాణం ప్రారంభమవుతుందని తెలిపారు. పంట కాల్వ రోడ్డులోని వంతెనను తొంభై శాతం పూర్తి చేసి వైసీపీ ప్రభుత్వానికి అప్పగిస్తే మిగిలిన పది శాతం పని కూడా చెయ్యలేక చతికిల పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు నెలల్లో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. మహానాడు అడ్డ రోడ్డు, తులసీనగర్, మురళీనగర్ ప్రాంతాల్లో దోమలు అధికంగా ఉంటున్నాయని, తరచూ ఫాగింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈడుపుగల్లులో ఇఫ్తార్ విందు

కంకిపాడు : రంజాన్ ఉపవాస దీక్షలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఈడుపుగల్లులో శుక్రవారం ఉదయం 3.30 గంటలకు నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ పందిపాటి ఇందిర, రావి సురేష్ బాబు, సాంబయ్య, ప్రసాద్, వెం కట్, రజని, ప్రభాకర్, షేక్‌బాషా పాల్గొన్నారు.

ఆలపాటికి సత్కారం

పెనమలూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా గెలుపొందిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కానూరు ప్రతిభ సివిల్స్ అకాడమీ యాజమాన్యం శుక్రవారం సత్కరించింది.

ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, అప్కా డెమొక్రటిక్ సంఘం అధ్యక్షుడు జి.మోహన్‌రావు, అప్కా రాష్ట్ర అధ్యక్షుడు తులసీవిష్ణుప్రసాద్, ప్రతిభ సివిల్స్ అకాడమీ చైర్మన్ జంపాన సుధాకర్, ఏవో నీలా సురేష్, కె.బాబ్జి పాల్గొన్నారు.



కంకిపాడు ఏఎంసీ చైర్మన్‌గా అన్నే ధనయ్య

పెనమలూరు/కంకిపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనరామకోటేశ్వరరావు(ధనయ్య) ఎంపికయ్యారు. ఆయన ఉప్పులూరు వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడిగా 1996 నుంచి 2003 వరకు పనిచేశారు. అనంతరం టీడీపీ మండల కార్యదర్శిగా పనిచేశారు. తనను ఏఎంసీ చైర్మన్‌గా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎంపీ బాలశౌరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

అన్నేకు అభినందనలు

ఏఎంసీ చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం అన్నే ధనయ్య పేరును ప్రకటించటంతో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, పందిపాటి సుధాకర్, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, గోగినేని వెంకటరమణ తదిత రులు అభినందించారు.



ఉయ్యూరు ఆర్టీసీ బస్‌డిపో గేటు ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు



ఆత్కూరు కోఆపరేటివ్ బ్యాంకులో వినతిపత్రం అందజేస్తున్న జేఎల్జీ గ్రూపు సభ్యులు

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

ఉయ్యూరు ఆర్టీసీ బస్‌డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యుల ఆందోళన

ఉయ్యూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : సర్క్యులర్ 1/2019ను అమలు చేయాలని, సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులు, ఉద్యోగులు శుక్రవారం ఉయ్యూరు ఆర్టీసీ డిపో గేటు ఎదుట నిరసన తెలిపారు. సర్క్యులర్ అమలు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యవైఖరిని అవలంబిస్తోందని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా తాత్సారం చేస్తోందని డిపో నాయకుడు పీఎం కృష్ణ అన్నారు.

అసోసియేషన్ జోనల్ కమిటీ పిలుపుమేరకు గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన తెలిపామన్నారు. అసోసియేషన్ నాయకులు ఆవుల శ్రీనివాసరావు, రాంబాబు, రజనీకాంత్, పిచ్చయ్య, అరుణోదయ, శాంతి, శివప్రసాద్, షఫీ, బీఎస్ రావు పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా రుణాలు చెల్లించేందుకు అనుమతివ్వాలి

● పీఏసీఎస్ వద్ద రైతుల ఆందోళన

ఉంగుటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆత్కూరు కో-ఆపరేటివ్ బ్యాంకులో జాయింట్ లయబిలిటీ గ్రూపు(జేఎల్జీ)లకు చెందిన సభ్యులు తాము తీసుకున్న రుణాలను వడ్డీలేకుండా చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలంటూ శుక్రవారం స్థానిక పీఏసీఎస్ వద్ద ఆందోళన చేశారు.

బ్యాంకు చేసిన తప్పిదాన్ని కప్పిపుచ్చుకుని గ్రూపులను ఇరకాటంలో పెట్టాలనుకోవడం సరికాదని కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి అన్నారు. బ్యాంకులో వ్యక్తిగత డిపాజిట్లు ఉన్న గ్రూపుల్లోని కొంత మంది సభ్యులకు ఇప్పటివరకు అసలు, వడ్డీ డబ్బులు కూడా చెల్లించలేదన్నారు. గ్రూపుల ద్వారా వారు తీసుకున్న రుణాలు మాత్రం వడ్డీతో సహా వసూలు చేయాలనుకోవడం దారుణమన్నారు. గ్రూపులు తీసుకున్న రుణాలు మాత్రమే(వడ్డీలేకుండా)చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలని కేడీసీసీ తేలప్రోలు బ్రాంచ్, ఆత్కూరు పీఏసీఎస్‌లో అధికారులకు వినతిపత్రాలు అందించారు. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు అజ్మీర్ వెంకటేశ్వరరావు, జేఎల్జీ గ్రూపుల సభ్యులు కర్నాటి వీరరాఘవులు, చీకటి అప్పలనాయుడు, చింతపల్లి పాపారావు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వీరవల్లి పీఏసీఎస్ ఆవరణలో జనసేన నియోజకవర్గ నాయకుడు గరికపాటి శివశంకర్ ఆధ్వర్యంలో శంకర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ నేత్రాలయ వైద్యులు 190 మందికి కంటి పరీక్షలు చేశారు. మందులు అవసరమైన వారికి గరికపాటి శివశంకర్, టీడీపీ నాయకులు లంక సురేంద్ర మోహన బెనర్జీ, గుండవనేని ఉమావరప్రసాద్, మండాది రవీంద్ర, కుంకునూళ్ల శ్రీనివాసరావు ఉచితంగా అందజేశారు. శుక్లాల ఆపరేషన్ అవసరమైన 65మందికి ఉచితంగా శస్త్రచికిత్స చేయిస్తామని గరికపాటి శివశంకర్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పెదపులిపాకలో పేకాట ఆడుతున్న ఆరుగురిని శుక్రవారం ఎస్సై ఫిరోజ్ ఆధ్వర్యంలో సిబ్బంది అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2500 స్వాధీనం చేసుకున్నారు. కోడి పందేలు, పేకాట నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతామని సీఐ వెంకటరమణ హెచ్చరించారు.

మన మిత్ర సేవలు సద్వినియోగం చేసుకోండి

హనుమాన్‌జంక్షన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న మన మిత్ర వాట్సాప్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9552300009 నెంబరుతో మనమిత్ర వాట్సాప్‌ను లింకు చేసుకుని అందులో పొందుపరిచిన పౌరసేవలను వినియోగించుకోవచ్చని ఎంపీడీవో సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

కంకిపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఏపీసీఎన్ఎఫ్ కార్యదర్శి డి.శ్రీకర్ సూచించారు. ఖరీఫ్ సీజనలో రైతులు చేపట్టాల్సిన ప్రకృతి వ్యవసాయంపై రైతుసేవా కేంద్రంలో ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. కె. పార్థసారథి, ఏవో పీఎం కిరణ్ పాల్గొన్నారు.

క్రెడిట్ క్యాంపు నేడు

ఉయ్యూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఈబీసీ, కాపు, రెడ్డి, బీసీ, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం ఉదయం 9 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో క్రెడిట్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు తెలిపారు. బ్యాంకు అధికారులు, సెలక్షన్ కమిటీ సభ్యులు అర్హులైన వారిని ఎంపిక చేస్తారని, దరఖాస్తు చేసుకున్న వారందరూ హాజరుకావాలని సూచించారు.



కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులుకు రైతుల కృతజ్ఞతలు



జంకన్ పాలశీతల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షులు

హనుమాన్‌జంక్షన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కృష్ణామిల్క్ యూనియన్ మూడో విడత బోనస్‌గా రూ.18 కోట్లు ప్రకటించడం హర్షణీయమని జంక్షన్ క్లస్టర్ పరిధిలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షులు పేర్కొన్నారు. పాలశీతల కేంద్రంలో యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులకు పలు గ్రామాల సహకార సం ఘాల అధ్యక్షులు కృతజ్ఞతలు శుక్రవారం తెలిపారు. పాడిరైతులకు గిట్టుబాటు ధరను కల్పిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందిస్తూ కృష్ణా మిల్క్ యూనియన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పిన్నమనేని లక్ష్మీప్రసాద్, కసుకర్తి నిరంజనరావు, వీరం రాంబాబు, జక్కుల ధనుంజయరావు, సూరపనేని సోని, యనమదల బాపయ్య, ఎనికేపల్లి వెంకటనారాయణ, మరీదు సూర్యప్రకాశరావు, పామర్తి సత్యనారాయణ, ఎదురువాడ వెంకట సుధాకర్, కళ్లే వెంకటేశ్వరరావు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.



జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

గన్నవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు జుమా(శుక్రవారం) ఎంతో ఉత్తమమైనదని, ఈరోజును ఈదుల్ మోమినీన్ అంటారని మసీద్ ఇమాం హఫీజ్ హసీన్ ఇక్బాల్ తెలిపారు. ముస్తాబాద జామియా మసీదులో రంజాన్ నెల చివరి శుక్రవారం ప్రత్యేక పార్థనలు జుమాతుల్ విధ ఘనంగా నిర్వహించారు. మసీదు కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాపట్ల రవికి అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డు



గన్నవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్లకు ఇచ్చే అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డును ప్రవంతి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు బాపట్ల రవికి గుంటూరు సదరన్ ప్రైవేట్ లెక్చరర్, టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్పీఎల్టీవో) ప్రకటించింది. ఏప్రిల్ 13న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవార్డు అందజేస్తారని రవి తెలిపారు. రవిని ప్రిన్సిపాల్ కొమ్మినేని రామృష్ణ ఉపాధ్యాయులు అభినందించారు.



నిత్యావసర సరుకుల పంపిణీ

ఉయ్యూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వాములు చేయాలని ఉయ్యూరు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆయేషా సూచించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుస్తుల పంపిణీ చేశారు. ఆయేషా పాల్గొన్నారు. టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అక్బర్ బాషా, నూకల సాంబశివరావు, ఎండీ ఇస్మాయిల్, సెక్రటరీ రాంబాబు, దినవహి ప్రసాద్, నల్లా శ్రీనివాసరావు, నేరెళ్ల వేణు, సాయి కృష్ణ పాల్గొన్నారు.

శిశువులకు పాలిచ్చే గది ప్రారంభం

ఉయ్యూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బస్టాండ్ ఆవరణలో శిశువులకు తల్లులు పాలిచ్చేందుకు ఏర్పాటు చేసిన గదిని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎన్ రాణి, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ వూర శ్రీవాణితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. తహసీల్దార్ ఎం.సురేశ్‌కుమార్, ఉయ్యూరు కమిషనర్ వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ కంకిపాడు సీడీపీవో బేబీ సుకన్య, సూపర్‌వైజర్ బేబీ సరోజిని, ప్రశాంతి, వూర కిషోర్ పాల్గొన్నారు.

పంజాన్ సందడి









దేదీప్యమానంగా వెలిగిపోతున్న పంజా సెంటర్

- ఉపవాస దీక్షలు ముగించుకుని సకుటుంబ సమేతంగా సెంటర్‌కు..
- కాంతులీనుతున్న దుకాణాలు, మాంసాహార, హలీం స్టాళ్లతో కళకళ
- సేమ్యా, ఖర్జూర పండ్ల కొనుగోళ్లతో కిక్కిరిసిపోతున్న సెంటర్
- జోరుగా వస్త్ర దుకాణాల్లో షాపింగ్

ఆంధ్రజ్యోతి, వన్‌టౌన్

పంజా సెంటర్‌లో రంజాన్ సంబరం అంబరాన్నంటుతోంది! విజయవాడ పాతబస్తీ పంజా సెంటర్ వీధులు తిరునాళ్లను తలపిస్తున్నాయి. ఉపవాస దీక్షలు ముగించుకున్న ముస్లిం సోదరులు సకుటుంబ సమేతంగా పంజా సెంటర్‌కు చేరుకుంటున్నారు. విందు, వినోదం, షాపింగ్‌తో హోరెత్తిస్తున్నారు. ఎటువైపు చూసినా వెరైటీలతో కూడిన మాంసాహార వంటకాల స్టాల్స్, చికెన్, మటన్ ఘుమఘుమలు పంజా వీధులను తాకుతున్నాయి. హలీం స్టాల్స్ గురించి అయితే చెప్పనక్కరలేదు. వస్త్ర దుకాణాల స్టాల్స్ వద్ద షాపింగ్ సందడి నెలకొంది. సేమ్యా, ఖర్జూరం, పండ్ల కొనుగోళ్లు భారీగా జరుగుతున్నాయి. విద్యుత్ దీపాలు, షామియానాలు, ఇతరత్రా అలంకారాలు, హలీం ఘుమఘుమలతో సాయంత్ర వేళ పంజా సెంటర్ తిరునాళ్లను తలపిస్తోంది. విద్యుద్దీపకాంతులు జిగేల్‌మంటూ ఓ కొత్త వాతావరణాన్ని రూపొందించాయి. మరికొద్ది రోజుల్లో ఉపవాస దీక్షలు ముగియనున్నాయి. ముస్లిం సోదరులు ఉదయాన్నే సూర్యోదయానికి ముందే అల్పాహారం తీసుకుని ఉపవాస దీక్ష ప్రారంభిస్తారు. తిరిగి సూర్యాస్తమయం తరువాత ఇఫ్తార్ విందు చేసుకుంటారు. ఈ క్రమంలోనే పండ్లు, డ్రై ఫ్రూట్స్, ఇతరత్రా ప్రత్యేకంగా తయారు చేసిన జ్యూస్‌ల వంటివి సేవిస్తారు. అన్నింటికంటే ముఖ్యంగా హలీంకు వీరు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. హలీంకు ఉన్న డిమాండ్ దృష్ట్యా హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి చేయి తిరిగిన వంట వారిని పిలిపించి ఘుమఘుమలాడే హలీంను సిద్ధంచేసి ముస్లిం సోదరులకు విక్రయించటం పంజా సెంటర్‌లో కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ఏ ఏటికాయేడు సరికొత్త హంగులతో స్టాళ్ల ఏర్పాటుతో కేవలం ముస్లిం సోదరులకే కాకుండా ఇతర జనాలను కూడా ఆకర్షిస్తున్నాయి. మతాలకు అతీతంగా అన్ని వర్గాలు కుటుంబాలు హలీమ్ స్టాళ్లను సందర్శిస్తున్నారు. హలీంకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ వంటకంలో ఆరోగ్య సంబంధిత మషాలాలను జోడిస్తారు. ఈ రుచికరమైన హలీంను ఎంతగానో ఇష్టపడతారు. సామాజిక పరివర్తనకు సంకేతంగా ఈ కలయికలను చూడవచ్చు. ఆరోగ్యపరంగానూ హలీం బెస్ట్. దీంతో ముస్లిం సోదరులతో పాటు ఇతరులు కూడా దీన్ని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. వన్‌టౌన్‌లో ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతం కాబట్టి హలీం స్టాళ్లను ఈ సెంటర్‌లో ఎక్కువగా ఏర్పాటు చేస్తారు. చికెన్, మటన్, వెజ్‌లలో హలీం రకరకాలుగా లభిస్తుండటంతో అందరూ ఆసక్తి చూపిస్తారు. ముఖ్యంగా రుచికరమైన హైదరాబాదీ హలీం అంటే ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తుంది. హలీం తయారీ కొంచెం కష్టమైన పనే. ఎక్కువగా చికెన్ హలీంని ఇష్టపడుతుంటారని స్టాల్స్ యజమానులు చెబుతున్నారు. చరిత్ర చూస్తే 1590లో అక్బర్ ఆస్థానంలోని అబుల్ ఫజల్ చక్రవర్తి హలీం మూలాలను రూపొందించినట్టుగా సమాచారం. ఈ వంటకాలను అప్పట్లో మూడు రకాలుగా వర్గీకరించారు. మాంసం లేని వంటకాలు, బియ్యం లేదా గోధుమ ఆధారిత వంటకాలు, మాంసం, రోటీతో వండీ హలీం ఇలా వర్గీకరణ చేసినట్టు చరిత్ర చెబుతుంది. ఉడికించిన మటన్, గోధుమలు, సుగంధ ద్రవ్యాలు వంటి వాటితో నెయ్యిని దట్టించి రుచికరంగా తయారు చేస్తారు. అందుకే హలీంను కేవలం ముస్లింలే కాకుండా ఇతరులు కూడా ఇష్టంతో తీసుకుంటారు. మరోవైపు గతంకంటే 15 నుంచి 25శాతం రేట్లు పెరిగాయి. సుగంధ ద్రవ్యాలు, నెయ్యి, డ్రైఫ్రూట్స్, మటన్, వంటి వాటితో పాటు వంటవారికిచ్చే వేతనాలు పెరగటంతో ఆ మేరకు రేట్లు పెరిగాయని చెబుతున్నారు. ఒక బౌల్ మటన్‌తో తయారు చేసిన హలీం సుమారుగా రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. వంటలో వాడే పదార్థాలను బట్టి రేట్లను నిర్ణయిస్తున్నారు. ఫ్యామిలీ ప్యాక్‌లు అందుబాటులో ఉన్నాయి. సాయంత్రం అయితే చాలు పంజా సెంటర్‌లో హలీం స్టాల్స్ జనాల రద్దీతో కిటకిటలాడుతూ పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి.


విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న పంజాసెంటర్



నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు

ఇంద్రకీలాద్రి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో పలువురు ప్రైవేటు కాంట్రాక్టర్లు దేవదాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా టెండర్లను దక్కించుకుంటున్నారని వి మర్శలు వినిపిస్తున్నాయి. కమిషనర్ కార్యాలయంలోని పలువురు సూపరింటెండెంట్ స్థాయి అధికారుల అండదండలున్నాయని తెలుస్తోంది. దేవస్థానంలో అన్నదాన విభాగంలో క్లీనింగ్, సర్వీసింగ్ పనిచేయటానికి సిబ్బందిని సప్లయ్ చేసేందుకు గతేడాది దేవస్థానంలో వేలంపాట జరిగింది. సుమారు 4 సంస్థలు పాల్గొన్నాయి. వాటిలో వీఎల్‌డీ ఏజెన్సీ కాంట్రాక్ట్ సంస్థ టెండర్‌ను దక్కించుకుంది. అయితే ఈ సంస్థకు లైసెన్స్ ముగిసిందని, దేవస్థానం పార్కింగ్ టెండర్‌ను పాడుకుని డబ్బులు ఎగ్గొట్టిందని, అంతేకాక కోర్టులోనూ కేసుందని వాంబే కాలనీకి చెందిన అమ్మవారి భక్తుడు ఎం.సి.రావు గతేడాది నవంబరు 30న నాటి కమిషనర్ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ విచారణ చేపట్టాలని, ప్రస్తుత దేవదాయ కమిషనర్, ఏడీసీ, దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్‌ను ఆదేశించటంతో ఆయన దుర్గగుడి డిప్యూటీ ఈవో రత్నరాజును విచారణ చేపట్టాలని సూచించారు. విచారణ అధికారి రత్నరాజు ఫిర్యాదుదారుడు ఎం.సి.రావుకు తన వద్ద ఉన్న ఆధారాలతో విచారణకు హాజరు కావాల్సిందిగా గతేడాది డిసెంబరు 11న నోటీసు జారీ చేశారు. దీంతో ఎం.సి.రావు విచారణకు హాజరై విచారణాధికారికి తన వద్ద ఉన్న ఆధారాలు అందజేశారు. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉంది. కాగా, వీఎల్‌డీ ఏజెన్సీ సంస్థ నిర్వాహకులు దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలోని సూపరింటెండెంట్ స్థాయి అధికారితో మాట్లాడుకుని టెండర్ దక్కేలా ప్రయత్నిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఫిర్యాదుదారుడు ఎం.సి.రావు ఈనెల 24న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ, దేవదాయ శాఖ కమిషనర్‌కు ఆ సంస్థపై ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వీఎల్‌డీ ఏజెన్సీ సంస్థకు టెండర్‌ను ఎలా కేటాయిస్తారని ఫిర్యాదుదారుడు ఎం.సి.రావు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇదే సంస్థ దేవస్థానానికి డబ్బులు ఎగ్గొట్టిన కోర్టులో కేసు వేసిందని ఎం.సి.రావు ఆరోపించారు. కాగా, ఈ వ్యవహారంపై దేవదాయశాఖ ప్రధాన కార్యాలయంలో ఓ సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా, వీఎల్‌డీ ఏజెన్సీ సంస్థపై ఫిర్యాదు రావటంతో విచారణ జరిగిందని, ఆ సంస్థపై కోర్టులో కేసు కూడా ఉందని ఆంధ్రజ్యోతికి చెప్పారు.



స్వామి వారి భూమిని స్వాధీనం చేసుకుని అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

రంగనాయక స్వామి ఆలయ భూమి స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగనాయక స్వామి ఆలయానికి చెందిన భూమిని 110 ఏళ్ల తరువాత దేవదాయ శాఖాధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈవో జయప్రకాష్ 2009లో కబ్జాకు గురైందని గుర్తించి బహిరంగ వేలం పాటలు నిర్వహించగా ఆ భూమి తమదని తిరుమలగిరికి చెందిన మహిళ కోర్టును ఆశ్రయించటంతో 2018లో భూమి దేవదాయ శాఖదని నిర్ధారించి ఉత్తర్వులివ్వటంతో అప్పటి నుంచి ఆ భూమి స్వాధీనానికి చర్యలు చేపట్టామన్నారు. స్వామి పేరుతో పాస్‌పుస్తకాలు తీసుకుని స్వాధీనం చేసుకున్నామన్నారు. త్వరలోనే వేలంపాటలు నిర్వహిస్తామన్నారు. ఆలయాల పర్యవేక్షణాధికారి పవన్‌కల్యాణ్, ముక్త్యాల కోటిలింగాల ఈవో హరిదుర్గానాగేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

99 ఏళ్ల తరువాత గుర్తించిన ఈవో

తిరుమలగిరి ఈవోగా పనిచేస్తున్న శారదా కుమారి స్వామి భూములకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తుండగా 2009లో రంగనాయక స్వామి ఆలయానికి చెందిన భూములను గుర్తించి అప్పటి కార్యనిర్వహణాధికారులకు వివరాలు అందించటంతో పటిష్ఠ చర్యలు తీసుకోకుండా హడావిడిగా వేలం పాటకు రంగంలోకి దిగారు. దీంతో సదరు భూమి తమదంటూ లింగమ్మ అనే మహిళ కోర్టును ఆశ్రయించటంతో దశాబ్దాలుగా కోర్టులోనే వివాదాలు నడిచాయి. చివరకు కోట్లు విలువ చేసే భూమి స్వాధీనమైంది. కాగా 2009లో 99 ఏళ్ల తరువాత రంగనాయక స్వామి ఆలయానికి చెందిన భూములను గుర్తించిన అప్పటి ఈవో శారదా కుమారికి అధికారులు, ప్రజాప్రతినిధులు బదిలీ బహుమతి అందించటం విశేషం.

దేవదాయ శాఖ ఎన్టీఆర్ జిల్లా

ఇన్‌చార్జి అధికారిగా నూతక్కి

వన్‌టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా నూతక్కి వెంకట సాంబశివరావును బదిలీచేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన దుర్గగుడి దత్తత సంస్థ సీవీ రెడ్డి ట్రస్ట్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా, కృష్ణాజిల్లా దేవదాయ శాఖ ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న పామర్తి సీతారామయ్య అనారోగ్యానికి గురికావటంతో సెలవుపై వెళ్లారు. కమిషనర్ ఉత్తర్వుల మేరకు నూతక్కి సాంబశివరావు ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ ఇన్‌చార్జి అధికారిగా నియమితులయ్యారు. రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోనున్నట్టు సమాచారం.

రియల్ బూస్ట్

నాలా చట్టం రద్దు నిర్ణయంతో సర్వత్రా హర్షం

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫీజు పెంపు.. దోపిడీ ● రెవెన్యూ అధికారులకు ఆదాయ వనరుగా మారిన వైనం ● చంద్రబాబు నిర్ణయంతో అన్ని వర్గాల నుంచి మద్దతు

కంచికచర్ల మండలంలో కృష్ణానది తీర గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 4 నెలల క్రితం ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేశాడు. అయితే రెవెన్యూ అధికారుల నుంచి ముప్పతిప్పలు ఎదుర్కొన్నాడు. కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో చివరికి తనకు తెలిసిన మంత్రిని ఆశ్రయించాడు. ఆయన జోక్యంతోనే కన్వర్షన్ సర్టిఫికెట్ లభ్యమైంది.

జగ్గయ్యపేట పరిసరాల్లో 8 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఓ పారిశ్రామికవేత్త ముందుకొచ్చాడు. వ్యవసాయ భూమిని పరిశ్రమకు వినియోగించేందుకు కన్వర్షన్ చేసుకోవాల్సి ఉండగా, నాల ఫీజుగా రూ.3.15 లక్షలు చెల్లించాల్సి వచ్చింది.

రియల్ ఎస్టేట్ వ్యాపారులు ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేస్తే, రెవెన్యూ అధికారులకు పండగే. అవసరమైన సర్టిఫికెట్ త్వరగా పొందాలంటే లంచం తప్పదు. భూమిని ప్లాట్లుగా మార్చి రోడ్లు వేస్తే, అడిగినంత చెల్లించాల్సిందే. లేకపోతే అనుమతి కోసం కాలయాపన తప్పదు



కంచికచర్ల - ఆంధ్రజ్యోతి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలా చట్టాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించడంతో రైతులు, పారిశ్రామిక వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం అభివృద్ధికి పెద్ద అడ్డంకిగా మారిందని, ఇప్పుడు రియల్ ఎస్టేట్, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు వేగంగా పురోగమిస్తాయని అభిప్రాయపడుతున్నారు. 1963లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం ప్రకారం, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్చేందుకు నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్ అసెస్‌మెంట్ (నాలా) ఫీజు చెల్లించడం తప్పనిసరి. గతంలో భూమి విలువలో (రిజిస్ట్రేషన్ వాల్యూ) 3 శాతంగా ఉన్న ఫీజును వైసీపీ ప్రభుత్వం 5 శాతానికి పెంచింది. ఈ చట్టాన్ని కొంతమంది రెవెన్యూ అధికారులు లంచాలకు వేదికగా మార్చుకున్నారని, లంచం లేకపోతే కన్వర్షన్ అనుమతులు ఆలస్యమవుతున్నాయని అనేక ఆరోపణలు వచ్చాయి. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ల్యాండ్ కన్వర్షన్ కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం, అనుమతుల కోసం అడ్డంకులు ఎదురవడం అభివృద్ధికి ఆటంకమవుతోందంటున్నారు. ముఖ్యంగా, అనుమతుల మంజూరులో లంచాల ప్రభావం ఎక్కువగా ఉందని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు నాయుడు నాలా చట్టాన్ని రద్దు చేస్తామని ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ప్రకటించారు. త్వరలో క్యాబినెట్‌లో చర్చించి, ఆర్డినెన్స్ రూపంలో అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. నాలా చట్టం రద్దుతో రియల్ ఎస్టేట్ రంగం తిరిగి ఊపందుకుంటుందని, పారిశ్రామికవేత్తలకు సులభతరమైన అనుమతులు లభిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాక, లైసెన్సులు, ఎన్‌వోసీల జారీ వేగవంతం చేయాలని యువ పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పుంజుకొంటున్న రియల్ ఎస్టేట్

నన్నపనేని సీతారామరాజు, రియల్టర్, కంచికచర్ల



నాలా చట్టం రద్దుతో ల్యాండ్ కన్వర్షన్ కోసం ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. భూమి విలువ ఎక్కువగా ఉండటంతో నాలా ఫీజు లక్షల్లో చెల్లించాల్సి వస్తున్నది. ఇప్పుడు ఆ భారం ఉండదు. దీంతో వెంచర్లలో స్థలాల ధరలు కూడా తగ్గనున్నాయి. ఇప్పటి వరకు మందంగా నడుస్తున్న రియల్ ఎస్టేట్ రంగం ఇక బాగా పుంజుకోవటానికి అవకాశమేర్పడింది.

సింగిల్ విండో విధానం అమలు చేయాలి

సీహెచ్ నాగేశ్వరరావు, వీఎస్ అసోసియేట్స్, విజయవాడ



నాలా చట్టం రద్దుతో పాటు పారిశ్రామిక పురోగతికి ప్రత్యేకంగా సింగిల్ విండో విధానాన్ని అమలు చేయాలి. ఏపీఐఐసీ అధీనంలోని ప్లాట్లలో ఏదైనా కంపెనీ, ఫ్యాక్టరీ, సంస్థ ఏర్పాటు చేస్తే సింగిల్ విండో విధానం ద్వారా 21 ప్రభుత్వ శాఖల నుంచి అన్ని అనుమతులు వస్తాయి. బయట కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తే వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి ఒక హద్దే ఉండదు.

మత్తుపదార్థాల విక్రయాలపై నిఘా పెంచండి

● కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో ఎస్పీ గంగాధర్‌రావు

మచిలీపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్తుపదార్థాల విక్రయాలపై నిఘా పెంచి నియంత్రించాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టర్ చాంబరులో శుక్రవారం జిల్లాస్థాయి నార్కోటిక్ సమన్వయ కమిటీ సమావేశం ఎస్పీ ఆర్ గంగాధరరావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజంపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, నేటి యువత మత్తుపదార్థాలకు బానిసలు కావడంతో, వారి ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. మత్తుపదార్థాల విక్రయాలను అదుపుచేసేందుకు అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ షాపుల్లో మత్తుపదార్థాలు విక్రయించకుండా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తరచూ తనిఖీలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల నడవడికపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఆటోమొబైల్ దుకాణాలు, పంచర్లు వేసే షాపుల వద్ద సొల్యూషన్ ట్యూబులను పిల్లలకు విక్రయించకుండా నిఘా పెట్టాలన్నారు. మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా, డీఈవో పీవీజే రామారావు, ఆర్డీవో కే స్వాతి, డీఎంహెచ్‌వో శర్మిష్ఠ పాల్గొన్నారు.

కవులు, కళాకారులకు పుట్టినిల్లు మచిలీపట్నం: గుత్తికొండ

మచిలీపట్నం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవులు, కళాకారులకు మచిలీపట్నం పుట్టినిల్లని ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అన్నారు. భావతరంగిణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మహతి కళావేదికపై ఉగాది వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో ఆయనతో పాటు ప్రపంచ రచయితల సంఘ కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్, సాహితీవేత్త డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య, కన్యకా పరమేశ్వరీ దేవస్థానం అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, భావతరంగిణి అధ్యక్షుడు భవిష్య, ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, కాశీపట్నపు ఉమ, లక్ష్మీకాంతం, లంకిశెట్టి బాలాజీ పాల్గొనగా, ప్రముఖ సాహితీవేత్త డా. ఆచార్య కొప్పరపు నారాయణమూర్తి, మైక్రో చిత్రకళాకారిణి నడకుదిటి సుజాతకు ఉగాది ప్రతిభా పురస్కారాలు అందచేశారు. అనంతరం పేరిణి శ్రీనివాస్ ప్రదర్శించి పేరిణి శివతాండవం నృత్యం, చేబ్రోలు రాజసులోచన బృందం ఆలపించిన పురందరదాసు, అన్నమయ్య కీర్తనలు ప్రేక్షకుల వీనులవిందు చేశాయి.

యువతిపై బ్లేడుతో దాడి

పెనమలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒక యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసు కోర్టులో నడుస్తుండగా తిరిగి అదే యువతిపై అదే యువకుడు ఆమెపై బ్లేడుతో దాడిచేసి పరారైన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోరంకి బీజేఆర్‌నగర్‌కు చెందిన ఒక యువతితో అదేప్రాంతానికి చెందిన కొమరవల్లి వర్ధన్ కొన్నిరోజుల క్రితం అసభ్యంగా ప్రవర్తించడంతో పోలీసుల కేసు నమోదు చేశారు. కోర్టులో కేసు నడుస్తోంది. 4 నెలలుగా మళ్లీ ఆ యువతి వెంటపడుతూ తన ఇంటికి రమ్మని వేధించడంతో ఆ యువతి గురువారం అతడి ఇంటికివెళ్లింది. అక్కడున్న యువకుడి పెదనాన్న డేవిడ్‌రాజు, విజయ్‌నిర్మల, చంటి ఉండి కేసు వెనక్కి తీసుకొమ్మని బెదిరించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి చెబుతాననగా డేవిడ్‌రాజు బ్లేడు తీసి వర్ధన్ చేతికివ్వగా అతడు ఆ యువతి పీకపై దాడి చేశాడు. గాయాలపాలైన యువతి చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా దయాల

మచిలీపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాల వేల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో నెంబరు 72ను జారీచేసింది. ఈ కార్పొరేషన్‌లో 15 మంది డైరెక్టర్లను నియమించగా, కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం నుంచి దయాల రాజేశ్వరరావుకు డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చారు. పదవీకాలం రెండేళ్లుంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గుడివాడ

● గుడివాడ ● పామర్రు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 460

మెగా జాబ్‌మేళాలో 38 మందికి ఉద్యోగాలు

గుడివాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. టెక్నోటాస్క్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, మోహన్ స్పిన్‌టెక్స్ ఇండియా లిమిటెడ్, పేటీఎం కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 56మంది హాజరుకాగా, 38మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో ఐదుగురు తదుపరి ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్, జిల్లా నియమాధికారి తుర్లపాటి మధు, ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీనియారిటీకి దక్కిన గౌరవం

● గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్‌గా పొట్లూరి రవికుమార్ నియామకం



గుడ్లవల్లేరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు పొట్లూరి రవికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అన్ని వర్గాల ప్రజలతో మమేకమై కలుపుకొని వెళ్లే వ్యక్తిగా రవికుమార్‌కు పేరుంది. గుడ్లవల్లేరు ప్రాథమిక వ్యవసాయ సంఘం అధ్యక్షుడిగా విధులు నిర్వహించిన అనుభవం సంఘాన్ని లాభాల బాటలో నిలిపిన సమర్థత ఉండటంతో ఆయనను ఈ పదవికి ఎంపిక చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కొనరాజు బాపయ్య చౌదరి, సీనియర్ నాయకులు వల్లభనేని వల్లభనేని బాబూరావు, వల్లభనేని వెంకటరావు మరికొందరు నాయకులు ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు సిఫార్సుచేయగా ఆయన అధిష్టానానికి సూచించారు. రవి పేరు ప్రకటించడంపై మండల నేతలు హర్షం వ్యక్తం చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు.

మొవ్వ ఏఎంసీ చైర్మన్‌గా బీజేపీ నేత

● దోనేపూడి శివరామయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



కూచిపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మొవ్వ ఏఎంసీ చైర్మన్‌గా కూచిపూడి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు దోనేపూడి శివరామయ్యను నియమిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈయన రెండు దశాబ్దాలకు పైగా బీజేపీలో క్రియాశీలకంగా ఉన్నారు. 2009 నుంచి 2014 వరకు బీజేపీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 2019 నుంచి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్, రోటరీ సంస్థలతోపాటు స్వచ్ఛ కూచిపూడి వంటి సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొని తనదైన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. పార్టీలకతీతంగా అందరితోనూ స్నేహపూర్వకంగా మెలిగే వ్యక్తిగా శివరామయ్య గుర్తింపు తెచ్చుకున్నారు. శివరామయ్య నియామకం పట్ల బీజేపీ నాయకులతో పాటు పార్టీలకతీతంగా పలువురు గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు. ఆయనకు అభినందనలు తెలిపారు.

పీ-4 సర్వే వారంలోగా పూర్తి చేయాలి

సిబ్బందికి కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం



గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏపీ మాస్ బృందంతో కలెక్టర్ డీకే బాలాజీ

గుడ్లవల్లేరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నిరుపేదల అభ్యున్నతికి తోడ్పడే పీ-4 సర్వేను వారంలోగా పూర్తి చేయాలని, సర్వేలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వే నిర్వహిస్తున్న ఏపీ మాస్ సంస్థ సర్వే బృందంతో ఆయన సమీక్ష నిర్వహించారు. సర్వే నిర్వహిస్తున్న తీరును ఆయన అడిగి తెలుసుకొన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా మండలంలోని కుచికాయలపూడిని తీసుకుని సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న సర్వే 80 శాతం పూర్తయ్యిందని, మిగిలిన 20 శాతం వచ్చే వారంలో పూర్తవ్వాలన్నారు. కనీస సదుపాయాలు లేని కుటుంబాలు ఏవి..ఏ జీవనోపాధి కల్పిస్తే వారు వృద్ధిలోకి వస్తారు వంటి వివరాలు సేకరించాలన్నారు. ఇళ్ల నిర్మాణం మధ్యలో నిలిచి పోయిందా ఏకారణం వల్ల నిలిచి పోయింది. పిల్లల చదువుకు అంతరాయం కలిగితే ఎందుకు కలిగిందో సర్వేలో సేకరించాలన్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నా సేకరించాలన్నారు. నిరుద్యోగ యువత ఉంటే వారికి ఏ నైపుణ్య శిక్షణ అవసరం, ఏ పని చేస్తే ఉపయోగం కలుగుతుందో సంగ్రహించాలని స్పష్టం చేశారు. డీఆర్డీయే పీడీ హరిహరనాథ్, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, ఏపీ మాస్ అధ్యయన బృందం నాయకురాలు ఎ.కళామణి, డివిజనల్ పంచాయతీ అధికారి పి.సుజాత, ఎంపీడీవో టి.విజయసారథి, తహసీల్దారు లోకరాజు, ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి



పామర్రులో పన్నులు వసూలు చేస్తున్న డీపీవో అరుణకుమారి

పామర్రు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన పన్ను బకాయిలను స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా సకాలంలో చెల్లించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ పిలుపునిచ్చారు. శుక్రవారం పామర్రులో పన్ను బకాయిల వసూళ్ల ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గఫ్ఫార్ ఐస్‌పాయింట్‌తో పాటు, గుడివాడ అర్బన్ బ్యాంకు భవన యజమాని నుంచి పంచాయతీకి రావలసిన పన్ను బకాయిలను స్వర్ణపంచాయతీ యాప్ ద్వారా ఆమె వసూలు చేశారు. మేజరు పంచాయతీ పామర్రులో పన్నుల వసూళ్లలో అనుకున్న లక్ష్యం చేరుకోకపోవడం ఏంటని ఈవో సలీంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

వేలం ప్రకటన

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) VUYYURU
EP 10/2022 in OS 227/2003
Between :-
1.Konatam Dharmaya (Died)
2.Konatam Nancharamma W/o Late Bharmayya Hindu, aged about 58 years, Cultivation
3. Konatam Chalamaiah S/o Late Dharmayya Hindu, aged about 43 years cultivation
4. Konatam Venkata Ramana S/o Late Dharmayya Hindu, aged about 41 years, cultivation
5. Konatam Vajra Rao s/o Late Sharmayya Hindu aged about 40 years, clutivation (All residents of Kuderu village Pamidimikkala Mandal, Krishna District J.C.J.C Vuyyuru .... D.Hrs
And
Konatam Tata Rao s/o Kotayya, Hindu. aged about 55 years, cutivation and properties R/o Kuderu village Pamidimikkala Mandal, Krishna District
... .J.Dr

యీ నెంబరులో డిక్రీబాకీ వగైరాల ఖర్చులు జె.డి.ఆర్ నుండి రాబట్టు కొనుటకు గాను జె.డి.ఆర్ తాలూకు యీ దిగువ షెడ్యూలు ధాఖలా ఆస్తి జప్తు కాబడి వేలము నిమిత్తం ది.17-04-2025వ తేది వాయిదా వున్నది. కనుక వాయిదా రోజు ఉదయం 10.30 గంటల లగాయితూ పై కోర్టు వారి యెదుట వేలం జరుగును. కనుక పాటదారులు పాటపాడు కోనవచ్చును

Schedule

An extent of AC 0-20 cents of Dry land in R.S.No. 398/5 situated at Krishnapuram Village, Pamidimukkala Mandal, Krishna District S.R.O Pamarru amidist the following boundaries:-
East:Land of Konatam Satya narayana, South:Land of Konatam Tata Rao, West:Land of Konatam Tata Rao, North: Land of Konatam Chittemma.
In the above said boundaries an extent of AC 0-20 cents of Dry Land
DHR Value: Rs.2,00,000/-
Market Value is of property is:Rs.2,50,000/-
Field Assistant (Amin) Value Rs.3,00,000/-
Agriculture tax of Rs.50/-

N.B:- పామర్రు సబ్ రిజిష్టారు వారి ఆఫీసు లో ది. 01-01-1983 ,నుండి ది. 02-01-2025 వతేది వరకు ఇ.సి తీసుకొనవడ మైనది. ఇ.సి దాఖలా ఎంట్రీ ప్రకారం ది. 27-07-2004 వ తేది న కొనతం సాంబశివరావు గారి వద్ద కొనుగోలు చేసిక్రయ దస్తావేజు పొందుట ద్వారా హక్కు సంక్రమించి వుండును హక్కు భక్తములతో ఉండి యున్నది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //
వేలం వాయిదా తేది: 17/04/2025
ఇట్లు:-
పంద్రాజు రాంబాబు బి.కాం ఎల్.ఎల్.యం., డి. హెచ్. ఆర్ తరపు న్యాయవాది, ఉయ్యూరు, కృష్ణాజిల్లా
సెల్‌ఫోన్ : 9393524999

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



గుడివాడలో విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గుడివాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను తగ్గిస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని గెలిచిన తరువాత కూటమి ప్రభుత్వం విస్మరించిందని, అంతకు రెట్టింపుగా చార్జీలు పెంచిందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి విమర్శించారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ శుక్రవారం ఏలూరురోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. చార్జీల భారాన్ని తగ్గించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని ఆర్సీపీ రెడ్డి హెచ్చరించారు. పి.రజిని, లంకా సురేంద్ర, యేషయ్య, వై.కోటేశ్వరరావు, వీకే కిషోర్, దానయ్య, మూర్తి, సుబ్బారావు, రాధాకృష్ణ, సమరం పాల్గొన్నారు.

కోసూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కూచిపూడి: విద్యుత్ చార్జీలు తగ్గించాలని, సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు నిలుపుదల చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో కోసూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతలు శీలం నారాయణ రావు, బత్తిన రామచంద్రరావు, మురహరిరెడ్డి, కొడాలి కరుణకర్‌రావు, బొల్లా సుబ్రహ్మణ్యం, కాకి రాజశేఖర్, సీతాదేవి, దుర్గాదేవి, శ్రీదేవి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



గురజాడలో ఇఫ్తార్ విందుకు విచ్చేసిన ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పెదపారుపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. శుక్రవారం రాత్రి వెంట్రప్రగడలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి(చంటి), సీనియర్ నాయకులు సూరపనేని సత్యనారాయణ, చప్పిడి కిషోర్, కూచిపూడి సుబ్బయ్య, చలసాని నవీన్‌చౌదరి, కూచిపూడి సుబ్బయ్య, కూచిపూడి శ్రీనివాసరావు, గొరిపర్తి రవికుమార్, షేక్ ఖాజా, మీర్ భాష, షేక్ సర్దార్, బాబ్జీ షేక్, సమద్ షేక్ నజీర్, షేక్ బికారి, షేక్ కరీముల్లా, జుజ్జవరపు భాను ప్రకాష్, పాతూరి బసవయ్య, చిలకా ఆంజనేయులు పాల్గొన్నారు.

గురజాడ మసీదులో..

పమిడిముక్కల: గురజాడ మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, టీడీపీ నాయకుడు జక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెదమద్దాలి మసీదులో..

పామర్రు: పెదమద్దాలి మసీదులో విశ్రాంత డిఫెన్స్ ఉద్యోగి వీవీ రావు వితరణతో ముస్లింలకు రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముస్లింలు వీవీరావుకు కృతజ్ఞతలు తెలిపారు.





విజయవాడ	:స్వర్ణమల్టీప్లెక్స్	మచిలీపట్నం	:శ్రీరామరాజు
విజయవాడ	:జి3 రాజ్ యువరాజ్	మచిలీపట్నం	:వరం PVR INOX
విజయవాడ	:ఊర్వశి INOX	గుడివాడ	:ABR సినిమాస్
ఎంజిరోడ్	:లైలా INOX	ఉయ్యూరు	:సాయిమహల్
లబ్బీపేట	:పివిపి సినీపోలీస్ తెలుగు / తమిళం	కైకలూరు	:జి3 విజయలక్ష్మి
లబ్బీపేట	:పివిఆర్‌సినిమాస్	ఐంటుమిల్లి	:శ్రీ దుర్గామహల్
బెంజ్‌సర్కిల్	:క్యాపిటల్ సినిమాస్	పామర్రు	:గగన్‌మహల్
పటమట	:LEPL INOX	నూజివీడు	:మినిసత్యనారాయణ
ఆటోనగర్	:పవర్‌సినీపోలీస్ తెలుగు / తమిళం	కంచికచర్ల	:పివిఆర్‌సినీప్లెక్స్
వనిటౌన్	:సాయిరామ్‌స్ర్కీన్స్	నందిగామ	:జి3 మయూరి
పెడుకూరు	:రవీంద్రసినిమాస్	జగ్గయ్యపేట	:జి3 కమల
గుణదల	:రామ్ సినిమాస్	తిరువూరు	:శ్రీవెంకటేశ్వరప్యాలెస్

Annapurna Stuidos (P) Ltd release



విజయవాడ	:శైలజ	పాయకాపురం	:తారాస్ర్కీన్స్
విజయవాడ	:జి3 రాజ్ యువరాజ్	గుణదల	:రామ్‌సినిమాస్
విజయవాడ	:ఊర్వశి INOX	కానూరు	:శ్రీవిజయలక్ష్మి
ఎంజిరోడ్	:లైలా INOX తెలుగు / మళయాళం	కంకిపాడు	:శ్రీచంద్ర
		ఉయ్యూరు	:జి3 శ్రీనివాస
లబ్బీపేట	:పివిపి సినీపోలీస్	మచిలీపట్నం	:సిరి కాంప్లెక్స్
లబ్బీపేట	:పివిఆర్‌సినిమాస్	మచిలీపట్నం	:వరం PVR INOX
బెంజ్‌సర్కిల్	:క్యాపిటల్ సినిమాస్ తెలుగు / మళయాళం	గుడివాడ	:జి3 భాస్కర్
		కైకలూరు	:జి3 విజయలక్ష్మి
పటమట	:LEPL INOX తెలుగు / మళయాళం	నూజివీడు	:సత్యనారాయణ
		నందిగామ	:జి3మయూరి
ఆటోనగర్	:పవర్‌సినీపోలీస్ తెలుగు / మళయాళం	జగ్గయ్యపేట	:జి3 కమల
		మైలవరం	:సంఘమిత్ర
వనిటౌన్	:సాయిరామ్‌స్ర్కీన్స్	తిరువూరు	:వెంకటేశ్వర ప్యాలెస్

G3 Movies LLP release

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు ఆర్కే

గుడివాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహానికి అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించి బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్కే) మానవత్వాన్ని చాటుకున్నారు. ముబారక్ సెంటర్‌లో వృద్ధురాలు శుక్రవారం అనారోగ్య కారణాలతో చనిపోయింది. ఆమె అనాథ కావడంతో స్థానికులు ఆర్కేకు సమాచారం అందించారు. గాదె చరణ్, లంకా రాంబాబు, ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు.

పామర్రు క్లస్టర్ పరిధిలోని సంఘాలకు రూ.1.3 కోట్ల బోనస్

● కృష్ణా మిల్క్ యూనియన్‌కు కృతజ్ఞతలు

● పామర్రు పాల ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి

పామర్రు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి మూడో విడత బోనస్‌గా కృష్ణా మిల్క్‌యూనియన్ రూ.18 కోట్లు ప్రకటించిందని పామర్రు క్లస్టర్ పరిధిలోని సంఘాలకు రూ.1.3కోట్లు బోనస్ ప్రకటించిందని పామర్రు పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. అందుకు యూనియన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం పాలకేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుడమేరు వరదల్లో 42రోజులు పాటు విజయవాడలోని పాల ఫ్యాక్టరీ మూతపడటంతో సంస్థకు రూ.24 కోట్లు నష్టం వాటిల్లిందని, అయినా లీటర్ పాలకు రూ.2 పెంచారని, క్రమం తప్పకుండా బోనస్‌ను ఇచ్చారని కృష్ణారెడ్డి అన్నారు. ఫీడ్ కమిటీ సభ్యులు సురేష్‌రెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు కొసరాజు సాంబశివరావు, మట్టా నారాయణ, ఆర్బీబీ మస్తాన్‌రావు, కాకర్ల వీర శ్యాంసుందరరావు, చందన సుబ్బారావు, చాపరాల నాగవల్లి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పెదపారుపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాలు దరిచేరవని ఈవోపీఆర్డీ వి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం శానిటేషన్ విధుల్లో భాగంగా పెదపారుపూడిలో ఆయన పర్యటించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం పరిశీలన



బిళ్లపాడులో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్డీవో సుజాత

గుడివాడ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బిళ్లపాడు గ్రామంలో ఆరేళ్ల లోపు వయస్సు పిల్లలకు ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయిస్తున్నట్లు డీఎల్డీవో సుజాత తెలిపారు. శుక్రవారం బిళ్లపాడు పంచాయతీలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఆధార్ నమోదు చేయడంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కీలక భూమిక పోషించాలన్నారు. ఆధార్ నమోదు చేయడం వల్ల అంగన్వాడీలు, ప్రీ స్కూల్‌లో పిల్లలను చేర్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎంపీడీవో డీవై విష్ణుప్రసాద్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

తెల్ల రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

గుడివాడ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవడం తప్పనిసరి అని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు తెలిపారు. టిడ్కో గృహాల్లో కొంతమందికి ఈకేవైసీ పూర్తవలేదని ఆయన అన్నారు. శుక్రవారం టిడ్కో గృహాల వద్ద తన బృందంతో కలిసి ఈకేవైసీ నమోదు కాని వారిని పిలిచి నమోదు చేయించారు. వేలిముద్ర, ఫొటో తీయించి వెంటనే ఆధార్ అనుసంధానం చేయించారు. తెల్ల రేషన్ కార్డుదారుల్లో ఎవరినైనా తొలగించాలన్నా, ఉన్న వారు వేరెక్కడైనా ఉన్నా ఈకేవైసీ చేయించుకోవాలని, లేకపోతే రేషన్ సరఫరా ఉండదని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈకేవైసీ కార్యక్రమం వేగంగా సాగుతోందని అన్నారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, ఆర్‌ఐ నాగబాబు, వీఆర్వోలు జి.లక్ష్మణరావు, డి.ప్రసాద్ పాల్గొన్నారు.

కాలినడకన భద్రాద్రికి..



జుజ్జువరం నుంచి కాలినడకన భద్రాద్రికి వెళుతున్న భక్తులు

పామర్రు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భద్రాద్రిలో జరగబోయే సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించడం కోసం జుజ్జువరం గ్రామం నుంచి 65 మంది భక్తులు శుక్రవారం కాలినడకన పయనమయ్యారు. వారికి కొత్త పెదమద్దాలి అడ్డ రోడ్డువద్ద పలువురు స్వాగతం పలికారు. 35 ఏళ్ల నుంచి గ్రామం నుంచి భద్రాద్రికి ఏటా క్రమం తప్పకుండా వెళ్తున్నామని బృంద నిర్వాహకుడు కాగిత బ్రహ్మయ్య తెలిపారు. 390 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగుతుందని వివరించారు. జొన్నలగడ్డ గిరిరాజు, పోతిన నాగశ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శిలువ మార్గం



శిలువమార్గ యాత్రలో పాల్గొన్న క్రైస్తవులు

గుడివాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల ఉపవాసదీక్షల్లో భాగంగా క్రీస్తు శిలువ మార్గయాత్రలను పట్టణంలోని బేతవోలు, మందపాడు, గుడివాడ రూరల్ మండలం తట్టివర్రు గ్రామాల్లో ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం విచారణ గురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహాయగురువు ఫాదర్ శ్రీకాంత్ ప్రార్థన చేసి యాత్రను ప్రారంభించారు. ఉపదేశకులు భాస్కర్, ఆంతోని, క్రీస్తురాజు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

పెదపారుపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, టీడీపీ నాయకుడు చప్పిడి కిషోర్ అన్నారు. పెదపారుపూడి గ్రామానికి చెందిన గారపాటి పద్మజారాణి రూ.1,80,000తో ఆమె కుడి చెయ్యి జాయింట్ మార్పిడి చికిత్స చేయించుకుంది. శుక్రవారం పామర్రు ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నుంచి మంజూరైన రూ.67,400 ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ని బాధితురాలి భర్తకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పెద ఎరుకపాడు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ కారణంగా రైలుపేట, బేతవోలు, నిమ్మతోట, బేతవోలు హైస్కూల్ రోడ్డు, వాంబే కాలనీల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ, వ్యవసాయ, వాణిజ్య వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

350 మంది విద్యార్థుల రక్తదానం

గుడ్లవల్లేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్ఆర్‌జీఈసీ)లో ఎన్ఎస్ఎస్ యూనిట్, గుడివాడ రోటరీ క్లబ్, మచిలీపట్నం రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించింది. 350 మంది విద్యార్థుల నుంచి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ వారు రక్తాన్ని సేకరించారు. శిబిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ ప్రారంభించారు. కళాశాల యాజమాన్య సలహాదారు డాక్టర్ పొట్లూరి రవీంద్రబాబు, అధ్యాపకులు, హెచ్‌వోడీలు రక్తదానం చేశారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ

పమిడిముక్కల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వార్షిక రుణ ప్రణాళిక, జీవనోపాధుల ప్రణాళిక తయారీపై మండల పరిధిలోని స్వయం సహాయసంఘాల సభ్యులకు శుక్రవారం స్త్రీశక్తి భవన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి 1,325 సంఘాల్లో 13,250 మంది సభ్యుల పొదుపు మొత్తం, సామాజిక స్థితి, కుటుంబ అవసరాల వివరాలు, అప్పు వివరాలపై రుణ ప్రణాళిక తయారు చేసుకోవాలని ఏపీఎం వెంకటేశ్వరరావు సూచించారు. వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 460

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలు రేపు

మచిలీపట్నం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవదాయ శాఖ ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశాల మేరకు మచిలీపట్నం బచ్చుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో ఈనెల 30న ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్టు జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ నూతనక్కి సాంబశివరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి విశ్వవసు ఉగాది వేడుకలను సంప్రదాయ సిద్ధంగా నిర్వహించనున్నామన్నారు. పంచాంగ శ్రవణం, వేదపఠనం, కవిసమ్మేళనం, కవులకు సన్మానం జరుగుతాయన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో కె. చంద్రశేఖర్ పాల్గొంటారన్నారు. కోలాట ప్రదర్శన, కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.

చల్లపల్లి జనసేన నేతకు ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి

● తోట కనకదుర్గ నియామకంతో హర్షాతిరేకాలు



చల్లపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్‌గా చల్లపల్లికి చెందిన జనసేన నేత తోట కనకదుర్గ నియమితులయ్యారు. అవనిగడ్డ నియోజకవర్గంలో అవనిగడ్డ, ఘంటసాల మార్కెట్ కమిటీలుండగా, అవనిగడ్డ టీడీపీకి, ఘంటసాల జనసేనకు కేటాయించేందుకు నిర్ణయించారు. దీంతో ఓసీ మహిళను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. జనసేన చల్లపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పని చేసే తోట కనకదుర్గను చైర్మన్ పదవి వరించింది. ప్రస్తుతం కనకదుర్గ చల్లపల్లి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా ఉన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన సామాన్య కార్యకర్తకు ఏఎంసీ చైర్మన్‌గా పదవి లభించటం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కనకదుర్గ నియామకంతో చల్లపల్లి మండలానికి తొలిసారిగా చైర్మన్ పదవి లభించింది. గతంలో మొవ్వ మార్కెట్ కమిటీ పరిధిలో మొవ్వ మండలం, ఘంటసాల మండలం, చల్లపల్లి మండలంలో కొన్ని గ్రామాలు ఉండేవి. మొవ్వ ఏఎంసీ కార్యాలయం, గోడౌన్‌లు ఘంటసాల మండలం కొడాలిలో ఉండేవి. గత కొన్నేళ్ల క్రితం మొవ్వ మండలాన్ని వేరుచేసి ఘంటసాల, చల్లపల్లి మండలాల పరిధితో ఘంటసాల ఏఎంసీగా మార్పు చేశారు.



ప్రకృతి సాగుపై మాట్లాడుతున్న ఏడీఏ శ్యామల



ప్రకృతి వ్యవసాయంపై శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ రావి దుర్గావాణి

ప్రకృతి సాగుపై దృష్టి సారించాలి

ఘంటసాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల పేర్కొన్నారు. వెలుగు కార్యాలయ వద్ద శుక్రవారం ఏవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం 2025-26 సంవత్సరం కార్యాచరణ ప్రణాళిక, అవగాహన సదస్సు నిర్వహించారు. సాగు విధానంలో రసాయనాలు, ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ విధానం వైపు రైతులు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామైక్య సంఘంలోని మహిళలు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. వీఏఏలు, ఐకేపీ వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు. **మోపిదేవి :** ప్రకృతి వ్యవసాయంపై రైతులు, గ్రామీణ ప్రజల్లో అవగాహన కల్పించాల్సిందిగా ఎంపీపీ రావి దుర్గావాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం - కార్యాచరణ ప్రణాళికపై వ్యవసాయ శాఖ వెలుగు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సాగులో రసాయనిక ఎరువులు, పురుగు మందులు రైతులు పోటీపడి అధికంగా వినియోగించటం వల్ల వాతావరణ కాలుష్యం, భూ సారం తగ్గిపోవటం, ఆరోగ్యాన్ని దెబ్బతీసే విధంగా ఉంటున్నాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తున్నాయన్న అంశాన్ని ప్రదర్శనాపూర్వకంగా రైతులకు గ్రామాల్లో తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవో స్వర్ణభారతి, ఏవో హెబ్సిబా రాణి, సంజయ్, ప్రకృతి వ్యవసాయ రీసోర్స్‌పర్సన్లు కృష్ణార్జున్, గ్రామస్థులు రావి నాగేశ్వరరావు ఉన్నారు.

సహకార సంఘాల కంప్యూటరీకరణ

మచిలీపట్నం టౌన్ : జిల్లాలోని సహకార సంఘాల్లో విధిగా కంప్యూటర్లు వినియోగిస్తూ జమా ఖర్చులను కంప్యూటరీకరించాలని, నెల రోజుల్లో ప్రతి ఒక్క సహకార సంఘం ఈ దిశగా లావాదేవీలు జరపాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.రాము పేర్కొన్నారు. బందరు మండలం కానూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో సంఘ సభ్యులు, రైతులతో మహాజన సభ జరిగింది. ఇకపై రైతులకు ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు జరుగుతాయని, కంప్యూటర్ ప్రింట్‌లోనే రశీదులు ఇస్తారన్నారు. జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్య నారాయణ, సంఘ మాజీ అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, జనసేన నాయకుడు దివి మహేష్, జొన్నల నాగమల్లేశ్వరరావు, జి. కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



చింతలమడ యువత చొరవ

● రహదారిలో సీసీ కెమెరాలు

చల్లపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక చర్యలు, సామాజిక దురాచారమైన బహిరంగ మల విసర్జనలను నివారించే క్రమంలో లక్ష్మీపురం నుంచి చింతలమడ వెళ్లే రోడ్డులో చింతలమడ యువకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో మందుబాబులు రోడ్డు వెంబడి మద్యం తాగడం, స్థానికుల మల విసర్జన కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు చింతలమడ యువకులు స్పందించి సోలార్ ఎల్ఈడీ సీసీ కెమెరాలను, హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేశారు.

జడ్పీ సెంటర్‌లో ఇండియన్ బ్యాంకు బ్రాంచి ప్రారంభం



ఇండియన్ బ్యాంకు బ్రాంచిని ప్రారంభిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, మున్సిపల్ కార్యాయానికి కంప్యూటర్ వితరణ

మచిలీపట్నం టౌన్ , మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం మచిలీపట్నం జిల్లా పరిషత్ సెంటర్‌లో శుక్రవారం ఇండియన్ బ్యాంకు నూతన శాఖను కలెక్టర్ డీకే బాలాజీ ప్రారంభించారు. కృష్ణాజిల్లాలో ఇది ఇండియన్ బ్యాంకు 371వ శాఖ కాగా, విజయవాడ డివిజన్‌లో 61వ శాఖ అని విజయవాడ జోనల్ మేనేజరు ఎం.రాజేష్ తెలిపారు. గతంలో కలెక్టరేట్‌లోని ఎక్స్‌టెన్షన్ కౌంటర్‌ను ఒక బ్రాంచిగా రూపొందించామన్నారు. మచిలీపట్నం జడ్పీ సెంటర్‌లోని శాఖ మూడవ శాఖ అన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజరు డి.రామారావు, ఎల్‌డీఎం రవీంద్రారెడ్డి, బ్రాంచి మేనేజరు కె.ప్రవీణ్‌కుమార్, ఏబీఎం శ్రావణి తదితరులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ సెంటర్‌లో ఇండియన్ బ్యాంకు శాఖ ప్రారంభించిన తొలి రోజే మచిలీపట్నం మునిసిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగానికి న్యూ బ్రాండెడ్ డెస్క్‌టాప్ కంప్యూటర్, మానిటర్, ప్రింటర్‌ను వితరణగా అందజేశారు. బ్యాంకు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మెప్మా పీడీ సాయిబాబు ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ చోడే వీరవెంకట బాపిరాజుకు కంప్యూటర్, మానిటర్, ప్రింటర్‌లను జోనల్ మేనేజర్ ఎం. రాజేష్ అందజేశారు. డిప్యూటీ జోనల్ మేనేజర్ రామారావు, ఎల్‌డీఎం రవీంద్రరెడ్డి, మచిలీపట్నం బ్రాంచ్ మేనేజర్ ఎం. ప్రవీణ్‌కుమార్, మెప్మా సీఎం ఆనందబాబు పాల్గొన్నారు.

వాసవీ విద్యార్థులు 100 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

పెడన రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్‌లో 100 మందికి ఉద్యోగాలు లభించాయని కళాశాల శిక్షణ, ఉపాధి విభాగాధిపతి డి.ఆదిత్య తెలిపారు.

హైదరాబాద్‌కు చెందిన టెకోన్, సూర్యా టెక్ సొల్యూషన్స్ బీటెక్, డిప్లొమో విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. టెకోన కంపెనీ బీటెక్ ఫైనల్ విద్యార్థినులు 50 మందిని 2.40 లక్షల వార్షిక వేతనంపై, సూర్యా టెక్ సొల్యూషన్స్ 50 మందిని రూ.3 లక్షల వార్షిక వేతనంపై ఎంపిక చేశాయన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ జి.ఎం ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, దోసపాటి బాబా, ప్రిన్సిపార్ బిఆర్ఎస్ రెడ్డి, ఎస్‌వికె ప్రసాద్ అధ్యాపకులు అభినందించారు.

విద్యుత్ భారాలు తగ్గించాలని నిరసన

● బందరు, చల్లపల్లి, మోపిదేవిలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన


మచిలీపట్నం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పెంచిన కరెంటు చార్జీలు రద్దు చేయాలంటూ రాజుపేట చింతచెట్టు సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు నాయకత్వం వహించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై ట్రూ అప్ పేరిట విద్యుత్ చార్జీలు అదనంగా వసూలు చేస్తోందన్నారు. తొమ్మిదినెలల కాలంలో రూ. 15వేల కోట్ల భారం విధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు కొడాలి శర్మ, ఎస్. ధనుంజయరావు, టి.చంద్రపాల్, సిహెచ్. జయ రావు, ఎండి యూనస్, పి. రాజు, తమ్ము చాందినీదుర్గ, సిహెచ్. విజయలక్ష్మి, ఎంఏ బెనర్జీ, ఎన్ఎస్ నారాయణతో పాటు ఎల్ఐసీ రిటైర్డు ఉద్యోగులు నాగయ్య, సత్యనారాయణ, రామారావు, కళాకారులు తమ్ము యువకిషోర్‌లు పాల్గొన్నారు. **చల్లపల్లి :** సీపీఎం రాష్ట్రకమిటీ పిలుపుమేరకు విద్యుత్ పంపిణీని ప్రైవేటుపరం చేయటాన్ని నిరసిస్తూ చల్లపల్లి విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట సీపీఎం నేతలు శుక్రవారం నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలపై అనేక భారాలు పడతాయన్నారు. ఆదానీతో చేసుకున్న 25 సంవత్సరాల ఒప్పందాన్ని విరమించుకోవాలనీ, స్మార్ట్‌మీటర్ల బిగింపు నిలిపివేయాలనీ, ట్రూఅప్, సర్దుబాటు చార్జీలు తగ్గించాలనీ, సెకీ ఒప్పందం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. నేతలు వాకా రామచంద్రరావు, మహమ్మద్ కరీముల్లా, బళ్లా వెంకటేశ్వరరావు, బండారు కోటేశ్వరరావు, వెనిగళ్ల వసంతరావు, యద్దనపూడి సుబ్రహ్మణ్యం, షేక్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ డీఈఈ పులి శివనాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. **మోపిదేవి :** అదనపు విద్యుత్ చార్జీల వసూలుకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. మోపిదేవి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, సర్ చార్జీలు, ఆదాని ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. మండల కమిటీ కార్యదర్శి సిహెచ్.రాజశేఖర్, కమిటీ సభ్యులు దోనె సహదేవుడు, కర్రా వెంకటేశ్వరరావు, బండి నిర్మల, పులివర్తి నాగమల్లేశ్వరరావు, కొమ్ము జయరావు పాల్గొన్నారు.



పెనుమల్లి హైస్కూల్‌కు దక్కన్ కెమికల్ కంపెనీ అందజేసిన కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

స్వచ్ఛంద సేవలు అభినందనీయం

పెడన రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావటం అభినందనీయమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు హైదరాబాద్‌కు చెందిన దక్కన్ ఫైన్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పెనుమల్లి హైస్కూల్‌కు రూ1.60 లక్షల విలువైన కంప్యూటర్, టేబుల్, కుర్చీలు అందజేసింది. కంప్యూటర్‌ను ప్రాంభిస్తూ, విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను గమనిస్తూ విద్యార్థులకు అవసరమైన రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కంపెనీ ప్రతినిధులు గణపతి, రాంబాబు, జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, సర్పంచి గరికపాటి రామానాయుడు, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, కాట్రగడ్డ నాగరాజు, మురాల ఫణి, కూనపరెడ్డి వీరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రేషన్ బియ్యం పట్టివేత

నాగాయలంక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తలగడదీవి రెవెన్యూ పరిధిలోని బర్రంకుల వంతెన వద్ద బోగాది సోమశేఖర్ (చిన్నారి)కి చెందిన రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 20 బస్తాల రేషన్ బియ్యాన్ని పీడీఎస్ డీటీ ఖాసింబాబు స్వాధీనపర్చుకున్నారు. రేకుల షెడ్డు యజమాని బోగాది సోమశేఖర్‌పై 6ఏ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఖాసింబాబు తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం



మోపిదేవి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పెదకళ్లేపల్లి చినదళితవాడ వద్ద ఉన్న చెరువులో మహిళ మహిళ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్సై సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మహిళ మృతదేహానికి సంబంధించి ఎవరికైనా ఆచూకీ తెలిసినచో చల్లపల్లి, మోపిదేవి పోలీసులకు, పెదకళ్లేపల్లి గ్రామ పంచాయతీకి సమాచారం తెలియజేయాల్సిందిగా పోలీసులు తెలిపారు.

బాలికల వసతిగృహంలో రీడింగ్ రూమ్ పనులు ప్రారంభం

మోపిదేవి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి ఎస్సీ బాలికల వసతిగృహంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులు రూ.33 లక్షలతో రీడింగ్ రూము పనులను శుక్రవారం ప్రారంభించారు. ఐదు నుంచి 10వ తరగతి వరకు బాలికలు వసతిగృహంలో ఉండగా, రాత్రి సమయాల్లో చదువుకునేందుకు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, మినరల్ ఫండ్స్ రూ.33 లక్షలను కేటాయించినట్లు ఏఈ శేఖర్ తెలిపారు. నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

అవనిగడ్డ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజనాల అంకారావు ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరిగింది. 62 మంది అభ్యర్థులు పాల్గొనగా, అందులో 36 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ముత్తూట్, కేఎల్ టెక్నికల్ సర్వీసెస్ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి. మండలి వెంకట్రామ్ పాల్గొని యువతకు ప్రభుత్వం అందిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి ఎం.వెంకటేశ్వరరావు, కో-ఆర్డినేటర్ పృథ్వీజ, ఆర్.ప్రశాంత్ పాల్గొన్నారు.

అవనిగడ్డ బార్ అధ్యక్షుడిగా సనకా రఘురామ ప్రసాద్

అవనిగడ్డ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సనకా రఘురామ్ ప్రసాద్ అధ్యక్షుడిగా గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా చెన్ను నాగమల్లేశ్వరరావు ఎన్నికయ్యారు. వైసీపీ యువ నేత బడే గౌతమ్ వారిని సత్కరించారు. నీటి సంఘం అధ్యక్షులు వర్రే బస్వారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం 1030 మంది దరఖాస్తు

అవనిగడ్డ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ, కాపు కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు మండలంలో 1030 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో మరియదేవి తెలిపారు. మండలానికి 104 యూనిట్లు మంజూరు కాగా, అర్హత కలిగిన వారిని గుర్తించి ఎంపిక చేయటం జరుగుతుందని తెలిపారు.

కోడూరు మండల సమావేశం 2న

కోడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కోడూరు మండల సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 2న తేదీన ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుధా ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, గ్రామసర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా కోరారు.

ఇంటింటికీ తాగునీరు అందించండి

కోడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ పథకం కోడూరు శివారు వేటపాలెం గ్రామంలోని దళిత కుటుంబాలకు ఇంటింటికీ తాగునీరు అందించాలని బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ కన్వీనర్ మద్దాల బాలయ్య కోరారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావుకు వినతిపత్రం అందజేశారు.

శారదానగర్‌లో ఆక్రమణల తొలగింపు

మచిలీపట్నం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం శారదానగర్‌లో ఆక్రమణలను శుక్రవారం పెద్ద ఎత్తున మునిసిపల్ అధికారులు తొలగించారు. ఎక్స్‌కవేటర్లతో ఆక్రమణల్లోని భవనాలను మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో కూలగొట్టారు.